ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పల్నాడు జిల్లా వార్తలు
5
శుక్రవారం 16 ఫిబ్రవరి 2024


తెనాలి: భారీగా నిలిచిపోయిన ట్రాఫిక్


సీఎం సభకు బస్సులు వెళ్లడంతో నిర్మానుష్యంగా ఉన్న రేపల్లె డిపో

సీఎం సభంటే.. వణికే


వైసీపీ జెండాలతో వెళ్తున్న బాపట్ల ఆర్టీసీ డిపో బస్సు

- బస్సులన్నీ జగన్ సభ కేటాయింపు
- సర్వీసులు లేక ప్రయాణాలకు ఇక్కట్లు
- అన్ని డిపోల నుంచి ఫిరంగిపురానికి తరలింపు
- ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి 400 కేటాయింపు
- బస్సులను దారిమళ్లించి అదనపు చార్జీ వసూళ్లపై గగ్గోలు
- తెనాలి - గుంటూరు రోడ్డుపై ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- బెదిరించి ఫిరంగిపురం సభకు తరలింపుపై వలంటీర్ల ఆవేదన

గుంటూరు, బాపట్ల, రేపల్లె, ఫిబ్రవరి 15: ముఖ్యమంత్రి జగన్ సభ అంటే ప్రజలు వణికిపోయే పరిస్థితి వస్తోంది. సామాన్యులను గమ్యస్థానాలకు చేర్చాల్సిన ఆర్టీసీ సీఎం జగన్ సేవలో తరిస్తోంది. ముఖ్యమంత్రి సభ అంటే చాలు ఆర్టీసీ డిపోలు ఖాళీ అవుతుండగా.. ప్రయాణాలకు సామాన్యులు అల్లాడిపోతున్నారు. డిపోల్లో బస్సులన్నింటినీ సీఎం సభకు కేటాయించడం పరిపాటిగా మారింది. సీఎం సభ అంటే చాలు బస్సులన్నింటినీ కేటాయిస్తుండటంతో సామాన్య ప్రయాణికులకు ప్రయాణ కష్టాలు తప్పడంలేదు. దీనిపై ఎన్ని విమర్శలు వచ్చిన మా తీరు మారదు.. అన్నట్లుగా ఆర్టీసీ అధికారులు వ్యవహరిస్తున్నారు. గురువారం ఫిరంగిపురంలో వలంటీర్లకు అభినందన పేరుతో నిర్వహించిన సభకు ముఖ్యమంత్రి జగన్ హాజరయ్యారు. ఈ క్రమంలో సభను విజయవంతం చేసేందుకు పెద్దసంఖ్యలో వలంటీర్లను తరలించారు. ఇందుకోసం సచివాలయాల వారీగా బస్సులను ఏర్పాటు చేశారు. దీంతో డిపోలన్నీ కూడా బస్సులు లేక వెలవెలపోయాయి. ప్రయాణాలకు సిద్ధమై వచ్చిన వారు డిపోల వద్ద గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఇంతకాలం సీఎం సభ అంటే ప్రయాణాలకు సామాన్యులు ఇబ్బంది పడగా గురువారం పలు రూట్లలో వాహనాల దారి మళ్లింపు కారణంగా దూరం పెరిగి ఆ మేర ఆర్టీసీ ప్రయాణికుల నుంచి అదనపు చార్జీలు వసూలు చేసి వారి జేబులకు చిల్లుపెట్టారు. సీఎం సభ కోసం ఉమ్మడి జిల్లా నుంచి 400 బస్సులను ఆర్టీసీ యాజమాన్యం ఏర్పాటు చేసింది. ఉమ్మడి జిల్లాతో పాటు కృష్ణా జిల్లా నుంచి కూడా మరో 60 నుంచి 70 సర్వీసులు రప్పించారు. ఆర్డినరీ బస్సులు లేక గుంటూరు-విజయవాడ, గుంటూరు-పర్చూరు, గుంటూరు-బాపట్ల ప్రాంతాల వరకు అనేక ఇబ్బందులు పడ్డారు. విజయవాడ రూట్‌లో అయితే ఆర్డినరీ సర్వీసులు లేక నాన్ స్టాప్ సర్వీసులు ఎక్కి మధ్యలో ఆపాలని ప్రయాణికులు కొందరు సిబ్బందితో వాగ్వాదాలు కూడా జరిగినట్లు సమాచారం. డిపోల నుంచి పెద్ద సంఖ్యలో బస్సులు సీఎం సభకు పెట్టడంతో రోజువారి ప్రయాణికులు బస్సుల కొరతతో ఇబ్బందులు పడ్డారు. కొంతమంది ప్రైవేటు వాహనాలను ఆశ్రయించి అధిక చార్జీలు చెల్లించి ప్రయాణించాల్సి వచ్చింది. రేపల్లె డిపో నుంచి బస్సులతో పాటు విద్యా సంస్థల బస్సులు కూడా వలంటీర్ల సభకు తరలి వెళ్లాయి. ఇక్కడ బస్సులే కాక కాకినాడ డిపోకు చెందిన బస్సులను కూడా తెప్పించి తీర ప్రాంత గ్రామాల నుంచి వైసీపీ నాయకులు, కార్యకర్తలను పెద్దఎత్తున సీఎం సభకు తరలించారు. సీఎం సభకు బాపట్ల డిపోలో 27 బస్సులు ఉండగా 20 బస్సులను కేటాయించారు. తెనాలి నుంచి మరో నాలుగు బస్సులు తెప్పించారు. దీంతో ఆర్టీసీ ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వచ్చింది. బస్సులు లేక ఆటోలు, ఇతర వాహనాలను ఆశ్రయించాల్సి వచ్చింది.

వస్తావా.. చస్తావా

గుంటూరు సిటీ, పిడుగురాళ్ల: 'ఏంట్రా ఓవర్ యాక్షన్ చేస్తున్నావ్. బస్సు వచ్చి ఎంత సేపైంది.. నువ్వేమన్న కలెక్టర్‌వా.. గంటలు గంటలు బస్సు ఆగడానికి.. మర్యాదగా వచ్చి బస్సెక్కు.. పిచ్చి పిచ్చి కలలు పడ్డావంటే ఉన్న ఉద్యోగం పోతుంది.. గంజాయి కేసులో పెట్టిస్తా నా కొ..' అంటూ వలంటీర్‌పై అధికార పార్టీ నేత బూతు పురాణమిది. గురువారం ఫిరంగిపురంలో జరిగే వలంటీర్ల అభినందన సభకు వలంటీర్ల తరలింపులో అధికార పార్టీ నేతలు అవలంభించిన తీరికిదో నిదర్శనం. వలంటీర్లందరూ రావాల్సిందే. సభకు ఏ ఒక్క వలంటీర్ కూడా మిస్‌కాకూడదు.. అంటూ వాట్సప్ గ్రూపుల్లో మెసేజ్‌లు, ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు జారీ చేయగా, వైసీపీ నేతలు ఎలాగైనా వారిని తీసుకెళ్లేందుకు చేయని ప్రయత్నం లేదు. జ్వరంతో బాధపడుతున్నా, సొంతింట్లో శుభకార్యం ఉందని చెప్పినా సరే ఎట్టి పరిస్థితుల్లోనూ సభకు రావాల్సిందేనంటూ హుకుం జారీ చేశారు. సీఎం జగన్ సభకు తప్పనిసరిగా రావాలని వలంటీర్లపై అధికార పార్టీ నేతలు నానా రకాలుగా ఒత్తిడి చేశారు. వలంటీర్లను తీసుకువచ్చే బాధ్యతను సచివాలయ కార్యదర్శికి అధికారులు అప్పగించారు. ఎవరు కార్యక్రమానికి వస్తున్నారు.. ఎవరు వెనకడుగు వేస్తున్నారు.. అన్న దానిపై సచివాలయ కార్యదర్శులు వివరాలు సేకరించారు. అయినా చాలామంది పెద్దగా ఆసక్తి ప్రదర్శించలేదు. ఈ పరిస్థితుల్లో వలంటీర్లను సీఎం సభకు తరలించే బాధ్యత ను ఆయా పంచాయతీల సర్పంచ్‌లు, అధికార పార్టీ నేతలు నెత్తికి ఎత్తుకున్నారు. మొదట నయాన, భయాన చెప్పి చూసినా వలంటీర్లు వెళ్లేందుకు ససేమిరా అనడంతో నేతలు బూతుల పంచాంగంతో బెదిరింపు లకు దిగారు. సభకి రాకపోతే ఉద్యోగం పోతుంది.. అంతటితో ఆగము.. ఇంకా చాలా జరుగుతాయి అంటూ పలు ప్రాంతాల్లో బెదిరించారు. ప్రత్తిపాడు, బాపట్ల, తెనాలి, వేమూరు, పొన్నూరు, గుంటూరు-2, సత్తెనపల్లి, పెదకూరపాడు, నరసరావుపేట, గురజాల తదితర నియోజకవర్గాల్లో ఎక్కువ మంది వలంటీర్లు సభలో పాల్గొనేందుకు వెనకడుగు వేసినట్లు తెలుస్తోంది. ఉదయం 7 గంటలకే ఆయా ప్రాంతాలకు బస్సులు వెళ్లాయి. అయినా ఉదయం 11 గంటలు దాటినా చాలామంది వలంటీర్లు బస్సులు ఎక్కక పోవడంతో స్థానిక వైసీపీ నేతలు బూతుపురాణాలు లంకించుకున్నారు. కొన్ని నియోజకవర్గాల్లో వలంటీర్లను తరలించే కార్యక్రమాన్ని నేరుగా ఎమ్మెల్యేలు పర్యవేక్షించారు. కొందరితో ఎమ్మెల్యేలే ఫోన్‌లో మాట్లాడి సభకు వెళ్లాలని చెప్పినట్లు తెలుస్తోంది.

ఎంత బెదిరించినా సగమే హాజరు

సీఎం సభకు రావాలని వైసీపీ నేతలు చేసిన ప్రయత్నాలు, బెదిరింపులను చాలా మంది పెద్దగా పట్టించుకోలేదు. సగానికి తక్కువ మందే సీఎం సభకు వెళ్లినట్లు తెలుస్తోంది. చాలా మంది తాము బయట ఉన్నామంటూ డుమ్మా కొట్టారు. నేతల ఒత్తిడి తాళలేక ఫిరంగిపురం వచ్చినా చాలామంది బస్సుల్లోనే కూర్చుండిపోయారు.

సచివాలయం మూత

పేరుకు వలంటీర్లుకు వందన కార్యక్రమం అయినా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని సచివాలయాలన్నీ మూత పడ్డాయి. సచివాలయంలోని ఉద్యోగులందరూ సీఎం సభకు రావాలని అధికారులు ఆదేశించారు. దీంతో సచివాలయాలకు తాళాలు పడ్డాయి. ఊర్లకు వచ్చిన బస్సులు ఖాళీగా వెళ్లకుండా సచివాలయ ఉద్యోగులతో మీటింగ్ ప్రదేశానికి చేరుకున్నాయి.

దూరం.. భారం

గుంటూరు: సీఎం జగన్ సభ అంటే ఆర్టీసీ ప్రయాణికులకు మొన్నటి వరకు ప్రయాణ కష్టాలు ఉండేవి. తాజాగా ప్రయాణంతో పాటు జేబులకు చిల్లు పడింది. సీఎం సభ పేరుతో ఆర్టీసీ బస్సులను దారి మళ్లించి ఆ పెరిగిన దూరం మేర ప్రయాణికుల నుంచి అదనపు చార్జీలు వసూలు చేశారు. ఫిరంగిపురంలో గురువారం జరిగిన జగన్‌సభ కారణంగా గుంటూరు నుంచి నరసరావుపేట, వినుకొండ వైపు నకు వెళ్లే వాహనాలను పేరేచర్ల, సత్తెనపల్లి, ముప్పాళ్ల మీదుగా నరసరావుపేటకు, అలానే గుం టూరు నుంచి యడ్లపాడు, చిలకలూరిపేట, నరస రావుపేట మీదుగా వినుకొండకు దారి మళ్లించారు. ఈ క్రమంలో ఆర్టీసీ బస్సులను కూడా ఆయా రూట్లలో తిప్పారు. ఇదే అదునుగా పెరిగిన దూరం భారాన్ని ప్రయాణికుల నెత్తిన వేసే పథకాన్ని ఆర్టీసీ అమలుచేసింది. సాధారణంగా నరసరావుపేట నుం చి గుంటూరు నాన్‌స్టాప్ సర్వీసుకు రూ.85 వసూ లు చేస్తారు. గురువారం మారిన రూట్ ప్రకారం బస్సు ఎక్కిన వారినుంచి రూ.110 ఛార్జీ వసూలు చేశారు. అలానే ఆర్డినరీ సర్వీసు సాధారణ రోజుల్లో రూ.55 వసూలు చేస్తుండగా గురువారం రూ.60 వసూలుచేశారు. ఇక వినుకొండ నుంచి గుంటూరు కు సాధారణ రోజుల్లో ఎక్స్‌ప్రెస్ రూ.125 ఉండగా గురువారం రూ.140 వసూలు చేశారు. సీఎం సభ కోసం బస్సులను దారి మళ్లించి ప్రయాణ సమయా న్ని పెంచడమే కాక అదనపు బాదుడుతో జేబులకు చిల్లు పెట్టడంపై ప్రయాణికులు గగ్గోలు పెట్టారు. ఇదేం బాదుడని సిబ్బందిని ప్రశ్నించడంతో చిన్న పాటి వాగ్వాదాలు కూడా చోటు చేసుకున్నాయి.


దూరం పెరగటంతో తప్పలేదు..

సీఎం సభ కోసం రూట్ మళ్లింపుతో 15 నుంచి 16 కిలోమీటర్ల వరకు దూరం పెరిగింది. దానికి అనుగుణంగా కిలోమీటర్ల వార ఛార్జీ పెంచాల్సి వచ్చింది. ఒకటి, రెండు కిలోమీటర్లు ఉంటే పెద్ద పట్టించుకునే వాళ్లం కాదు. దూరం ఎక్కువగా పెరగడంతోనే టిక్కెట్ రేటు పెంచాల్సి వచ్చింది.

- పల్నాడు డీపీటీవో శ్రీనివాస్

నిలిచిన ట్రాఫిక్

తెనాలి రూరల్: ఫిరంగిపురం వద్ద ఏర్పాటు చేసిన సీఎం సభకు వలంటీర్లను తరలించే బస్సుల కారణంగా ఆయా మార్గాల్లో ఎక్కడికక్కడ ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయంతో ప్రయాణికులకు నరకం కనిపించింది. తెనాలి మండలం అంగలకుదురు- సంగంజాగర్లమూడి మధ్యలో బస్సుల్లో వెళ్లే వారికి విందు ఏర్పాటు చేశారు. ఆయా వాహనాలను రద్దీగా ఉండే ప్రధాన రోడ్డుపై నిలిపివేశారు. దీంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు గంటల తరబడి తీవ్ర అంతరాయం ఏర్పడింది. దాదాపుగా రెండు కిలోమీటర్లకు పైగా వాహనాలు నిలిచిపోయాయి. ప్రధాన మార్గంలో వాహనాలను నిలిపి దర్జాగా విందు చేయడం ఏమిటో.. ఎప్పుడు చూడలేదని వాహనదారులు మండిపడ్డారు. గంటల తరబడి ట్రాఫిక్ నిలిచి పోవడంతో అంబులెన్స్‌లు సైతం వేచి ఉండక తప్పలేదు. తెనాలి రూరల్ ఎస్ఐ కోటేశ్వరరావు సిబ్బందితో వచ్చి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. పోలీసులు 30 నిమిషాలు ప్రయత్నిస్తే కానీ వాహనాలు ముందుకు కదలలేదు. పొలాల్లో భోజనాలు చేయడంతో పంటలు దెబ్బతింటాయని చెబుతున్నా పట్టించుకోలేదని కొందరు రైతులు వాపోయారు.


DONDAPADU VOLUNTEERS ATTENDANCE REPORT 15-02-2024

S.no	CLUSTER NO	Name of the Volunteer	Mobile No.	Signature
1	C1	PERAM ALIVELU		
2	C2	BEJJANKI SIVASANKAR		
3	C3	CHINNAPUREDDY ... MAPRIYA		
4	C4	PERAM SUSHMITHA		
5	C5	CHIMATA SRILAKSHMI		

పల్నాడు జిల్లా దొండపాడు నుంచి సగం మంది వలంటీర్లే వెళ్లినట్లు ఉన్న హాజరు షీట్


రేపల్లె: బస్సుల కోసం వేచి ఉన్న ప్రయాణికులు

పల్నాట.. మహా మలుపు

- 'లావు' నేతృత్వంలో యరపతినేని, జంగా భేటీ
- రాజకీయ వైరాలకు స్వస్తి.. ఉమ్మడి ప్రత్యర్థిపై దృష్టి
- అనిల్‌కుమార్‌కు చెక్ పెట్టేందుకు వ్యూహం
- చంద్రబాబుతో లావు, యరపతినేని భేటీ

నరసరావుపేట, గుంటూరు సిటీ, ఫిబ్రవరి 15: చాలాకాలం తర్వాత పల్నాడు రాజకీయ యవనికపై నూతన అధ్యాయం ఆవిష్కృతమైంది. పల్నాట రెండు భిన్న ధ్రువాలుగా ఉన్న ముఖ్యనేతలు ఒకే ఫ్రేమ్‌లోకి వచ్చారు. రెండు దశాబ్దాల పైబడి రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్న మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి భేటీ అయ్యారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు నేతృత్వంలో గురువారం ఈ భేటీ జరిగినట్లు తెలుస్తోంది. ఉమ్మడి గుంటూరు జిల్లా రాజకీయాల్లో పట్టుకలిగిన ఇద్దరు నేతలు ఎన్నికలకు ముందు జరిపిన భేటీలో చాలా ముఖ్య విషయాలు చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. గురజాల రాజకీయ ముఖ చిత్రాన్ని ఆసాంతం మార్చివేసే ఈ సంఘటనలో ఎక్కువ భాగం ఉమ్మడి ప్రత్యర్థిగా వైసీపీ పైనా, ఆ పార్టీ కొత్తగా తీసుకువచ్చిన వలస నేత అనిల్‌కుమార్‌పైన చర్చ జరిగినట్లు సమాచారం. కొంతకాలంగా ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి జగన్ ఒంటెత్తు పోకడలపై ధ్వజమెత్తుతున్న సంగతి విదితమే. జగన్ ముఖ్యమంత్రి కావాలని జంగా నానా రకాల పోరాటాలు చేసి అప్పటి ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్యతో కూడా ఇబ్బందులు పడ్డారు. వైసీపీ బీసీ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడుగా ఉండి ఆ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు ఎన్నో వ్యయ ప్రయాసలకు కోర్చాడు. జంగా కష్టాన్ని గమనించిన వైసీపీ పెద్దలు అధికారంలోకి వచ్చాక అది ఇస్తాం.. ఇది ఇస్తాం.. అంటూ అరచేతిలో వైకుంఠం చూపించారు. తీరా అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్సీ పదవి ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ఒక దశలో టీటీడీ చైర్మన్ పదవి జంగాకి ఇస్తున్నట్లు వైసీపీ అనుకూల మీడియాలో కథనాలు వచ్చాయి. దాంతో అప్రమత్తం అయిన జగన్ సామాజికవర్గం ఆయనకు వ్యతిరేకంగా పావులు కదిపింది. పదవిస్తే చేయి దాటిపోతారనే కొత్త వాదనలు తెరపైకి తెచ్చి ఆయనకు నష్టం జరిగేలా చేశారు. అటు జంగా ఎమ్మెల్సీ అన్న పేరు మాత్రమే కానీ గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ఆయనకు ఏ విషయంలోను తగిన ప్రాధాన్యం ఇచ్చిన దాఖలాలు లేవు. చివరకు జంగా సొంత గ్రామంలో జరిగిన కార్యక్రమంలో కూడా అక్కడి ఎమ్మెల్యే సరైన ప్రొటోకాల్ పాటించకుండా చిన్నచూపు చూశారు.

కలిసి ప్రయాణం..

1999, 2004, 2014 ఎన్నికల్లో రాజకీయ ప్రత్యర్థులుగా ఎన్నికల బరిలో దిగిన యరపతినేని, జంగా మధ్య పాత సంగతులు పెద్దగా చర్చకు రానప్పటికీ కొన్ని విషయాలపై వారు మనసు విప్పి మాట్లాడుకున్నట్లు తెలిసింది. ఇద్దరి మధ్య ఆనాటి నుంచి ఈనాటి వరకు రాజకీయ వైరమే కానీ, వ్యక్తి గత వైరం లేదని ఇక మీదట కలిసి ప్రయాణం చేయాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి ప్రత్యర్థులపై పల్నాడు దెబ్బ ఎలా ఉంటుందో రుచి చూపించాలని నిర్ణయించుకున్నారని సమాచారం.

సామాజిక వర్గంలో 'జంగా' కే ఓటు

ఉమ్మడి గుంటూరు జిల్లాతో పాటు, ఆంధ్రలోని చాలా జిల్లాల్లో జంగా కృష్ణమూర్తికి తన సామాజికవర్గంలో తగిన గుర్తింపు ఉంది. గతంలో జంగా గురజాల ఎమ్మెల్యేగా పోటీ చేసినప్పుడు కూడా ఆ సామాజిక వర్గ నేతలు పార్టీలకు అతీతంగా మద్దతు తెలిపి, సహకరించేవారు. వామపక్ష భావజాలం కలిగి, సామాజికవర్గంలో బలమైన నేతగా ఉన్న జంగాను కాదని, నెల్లూరు జిల్లాలో వివాదాస్పదంగా ఉన్న అనిల్‌కుమార్‌కు నరసరావుపేట లోక్‌సభ సీటు ఇవ్వడంపై కూడా నేతలు మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తోంది. జంగా లక్ష్యంగా అనిల్ చేసిన వ్యాఖ్యలు వీరి మధ్య చర్చకు వచ్చినట్లు తెలిసింది.

ముహూర్తం ఖరారు

నరసరావుపేట లోక్‌సభ సభ్యుడు లావు శ్రీ కృష్ణదేవరాయలు టీడీపీలో చేరేందుకు ముహూర్తం ఖరారైంది. ఆయన 22న టీడీపీలో చేరేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. గురువారం టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడును ఎంపీ లావు కలిశారు. పార్టీలో చేరే అంశంపై వారి మధ్య చర్చలు జరిగాయి. 22న పార్టీలో చేరతానని లావు చంద్రబాబును కోరారు. ఇందుకు చంద్రబాబు లావుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. లావుతో పాటు ఎమ్మెల్సీ, మాజీ ఎమ్మెల్యే జంగా కృష్ణమూర్తి కూడా చంద్రబాబును కలిశారు. జంగా కూడా టీడీపీలో చేరే అంశంపై చర్చించారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు వైపీపీని వీడిన విషయం తెలిసిందే. ఎంపీ లావుతో పాటు ఎమ్మెల్సీ జంగా, మక్కెన చంద్రబాబు సమక్షంలో 22న టీడీపీలో చేరనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. నరసరావుపేట లోక్‌సభకు పార్టీ అభ్యర్థిగా లావు శ్రీకృష్ణదేవరాయలు పేరును ఇప్పటికే టీడీపీ అధిష్ఠానం ఖరారు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆయన టీడీపీ నేతలను కలిసి పోటీ అంశంపై చర్చలు జరిపారు. డాక్టర్లు, ఉపాధ్యాయుల సమావేశంలో కూడా ఆయన పాల్గొన్న విషయం తెలిసిందే. జిల్లా న్యాయవాదుల సమావేశానికి కూడా లావును ఆహ్వానించారు. వైసీపీలో తనకున్న పరిచయాలను అనుకూలంగా మలుచుకునేందుకు లావు పావులు కదుపుతున్నారు.

దారి కాచి.. ఢీ కొట్టి.. దాడి

- పల్నాడులో ఆగని వైసీపీ అరాచకాలు
- నిన్న రొంపిచర్ల.. నేడు జంగమహేశ్వరపురంలో
- రెండు చోట్లా ఒకే తరహాలో వైసీపీ నేతల దాడులు
- ఎన్నికల్లో భయకంపితులను చేసేందుకు తెగబడుతున్న వైనం

నరసరావుపేట, ఫిబ్రవరి 15: పల్నాడు జిల్లాలో అధికార పార్టీ నేతల అరాచకాలకు అడ్డేలేకుండా పోతుంది. ఎప్పుడు ఏ రూపంలో ఎవరిపై దాడి జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. వైసీపీ మూకలు పెట్రేగిపోతున్నా పోలీసులు ప్రేక్షకపాత్రకే పరిమితమవుతున్నారు. దీంతో రానున్న ఎన్నికల్లో టీడీపీ శ్రేణులను భయకంపితులను చేసే లక్ష్యంతో వైసీపీ నాయకులు బరితెగిస్తున్నారు. టీడీపీ శ్రేణులను టార్గెట్ చేస్తూ దాడులకు తెగబడుతున్నారు. నిన్న రొంపిచర్ల మండలంలో తురిమెళ్లకు చెందిన టీడీపీ నేతపై వైసీపీ గుండాలు దాడి చేయగా తాజాగా గురువారం మాచర్ల నియోజకవర్గం జంగమహేశ్వరపురంలో టీడీపీకి చెందిన ముగ్గురిపై అధికార పార్టీ మూకలు హత్యాయత్నానికి పాల్పడ్డాయి. రెండు సంఘటనలు ఒకే తరహాలో జరిగాయి. రెండు చోట్ల పథకం ప్రకారం దారి కాచి వాహనాలతో ఢీ కొట్టి ఆపై రాడ్లు, కర్రలతో హతమార్చేందుకు యత్నించారు. ఎన్నికలు సమీపిస్తున్నా అరాచకశక్తులకు పోలీసులు కొమ్ము కాస్తున్నారన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మాచర్లలో అంబేద్కర్ రాజ్యాంగానికి బదులు పిన్నెల్లి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని ప్రతిపక్షాల నుంచి విమర్శలు వస్తున్నా పోలీసులు దూలుపేసుకుంటున్నారన్న ఆరోపణలను ఎదుర్కొంటున్నారు.

జూలకంటిని అడ్డుకునేందుకేనా..

జంగమహేశ్వరపురంలో పర్యటించేందుకు టీడీపీ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి పోలీసుల అనుమతి కోరారు. 15 రోజులుగా ఆయన పోలీసుల అనుమతి కోసం ఎదురు చూస్తున్నారు. బ్రహ్మారెడ్డి పర్యటన ఎమ్మెల్యేకు ఇష్టంలేదు. ఈ క్రమంలో పథకం ప్రకారం టీడీపీకి చెందిన ముగ్గురిపై హత్యాయత్నానికి ఒడిగట్టినట్టు ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. టీడీపీ సానుభూతిపరులుగా ఉండటం వల్లే యాదవ సామాజిక వర్గీయులను అధికార పార్టీ టార్గెట్ చేస్తున్నదని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. నెల వ్యవధిలోనే పలు సంఘటనలు చోటు చేసుకున్నాయి. వైసీపీలో చేరాలని వెల్దుర్తి మండలం పెంటతండాకు చెందిన మత్స్యకారుడు దుర్గారావును వేధింపులకు గురి చేశారు. ఇంతటితో ఆగక పోలీసులు అతడిపై కేసు నమోదు చేసి వేధించడంతో ఆత్మహత్య చేసుకున్నాడు. మాచర్ల మండలం కొత్తపల్లిలో టీడీపీ, జనసేన ఆత్మీయ సమావేశం జరిగిన రోజునే టీడీపీకి చెందిన వ్యక్తి ద్విచక్ర వాహనాన్ని వైసీపీ అల్లరి మూకలు దహనం చేశాయి. రెంటాలలో ఇద్దరు టీడీపీ నేతలపై వైసీపీ వ్యక్తులు దాడి చేసి గాయపరిచారు. ఇలా వరుస దాడులకు పాల్పడుతూ మాచర్ల నియోజకవర్గంలో వైసీపీ భయానక వాతావరణం సృష్టిస్తోంది.


దుర్గి పీహెచ్‌సీ వద్ద శ్రీను


మాచర్ల ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న అంజయ్య, రాజు

టీడీపీలో భారీగా చేరికలు

మాచర్ల నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా వలసలు జరుగుతున్నాయి. అడిగొప్పల, తాళ్లపల్లి, కారంపూడి, మాచర్ల, జమ్మలమడుగుల్లో అధిక సంఖ్యలో వైసీపీ శ్రేణులు టీడీపీలో చేరాయి. వీటిని నిరోధించలేక పోతున్న అధికార పార్టీ దాడులకు పాల్పడుతున్నట్లు టీడీపీ వర్గాలు ఆరోపిస్తున్నాయి. దాడులపై ఫిర్యాదులు ఇచ్చినా పోలీసులు సరైన రీతిలో స్పందించడంలేదని, కేసులు కూడా నమోదు చేయడంలేదని జూలకంటి బ్రహ్మారెడ్డి ఆరోపిస్తున్నారు.

రేపే.. రా కదలిరా

- ఇంకొల్లులో భారీగా ఏర్పాట్లు
- 25 ఎకరాల విస్తీర్ణంలో బహిరంగసభ
- ప్రాంగణానికి తారకరామ విజయభేరిగా నామకరణం
- నియోజకవర్గ నేతలతో ఏలూరి సన్నాహక సమావేశం
- పోలీసులను ప్రయోగించి అవాంతరాలకు ప్రభుత్వం కుట్ర

ఇంకొల్లు/బాపట్ల, ఫిబ్రవరి 15(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా రా.. కదలిరా అంటూ టీడీపీ శ్రేణులు సిద్ధమవుతున్నారు. రా.. కదలిరా అంటూ టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లోక్‌సభ స్థానాలవారీగా బహిరంగసభలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా బాపట్ల లోక్‌సభ స్థానంలోని పర్చూరు నియోజకవర్గ పరిధి ఇంకొల్లులో శనివారం సభ నిర్వహించనున్నారు. దాదాపు 25 ఎకరాల స్థలంలో ఏర్పాట్లను భారీఎత్తున చేస్తున్నారు. సభా ప్రాంగణానికి తారకరామ విజయ భేరిగా నామకరణం చేశారు. ఈ ఇప్పటికే భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. హెలిపాడ్ స్థలం, పవర్‌రోలర్‌తో ప్రాంగణం అంతా గట్టిచేసే పనులు జరుగుతున్నాయి. 40 అడుగుల వెడల్పు, 60 అడుగుల పొడవుతో సభా స్టేజి పనులు వేగంగా జరుగుతున్నాయి. వాహనాలను పార్కింగ్‌కు ఆరెకరాల భూమిని చదును చేశారు. స్థానిక నాయకులు పాలేరు రామకృష్ణ, డాక్టర్ శ్యాం, బత్తుల శ్రీనివాసరావు, కరి శ్రీను, వడ్లమూడి సాంబయ్య, శ్రీహరి, రంగయ్య, పొద వీరయ్య, ఫారూక్, చైతన్య, బోడావుల శివయ్య ప్రాంగణంలో పనులు పర్యవేక్షిస్తున్నారు.


సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు సాంబశివరావు, రవికుమార్

దిక్సూచి DIKSUCHI

'హోటల్' కోర్సుల్లో ప్రవేశానికి ఎన్‌సీహెచ్ఎం జేఈఈ



నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)- నేషనల్ కౌన్సిల్ ఫర్ హోటల్ మేనేజ్‌మెంట్ జాయింట్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ (ఎన్‌సీహెచ్ఎం జేఈఈ) 2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. దీని ద్వారా బీఎస్సీ(హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్) ప్రోగ్రామ్‌లో ప్రవేశం కల్పిస్తారు. ఈ ఎగ్జామ్‌లో సాధించిన మెరిట్ ప్రకారం దేశవ్యాప్తంగా ఉన్న ఎన్‌సీహెచ్ఎంసీటీ అనుబంధ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు.

సీట్లు: దేశవ్యాప్తంగా మొత్తం 11995 సీట్లు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల్లో తిరుపతిలోని స్టేట్ గవర్నమెంట్ ఐహెచ్ఎంలో 60, హైదరాబాద్‌లోని సెంట్రల్ గవర్నమెంట్ ఐహెచ్ఎంలో 285, స్టేట్ గవర్నమెంట్ ఐహెచ్ఎం-డా.వైఎస్సార్ ఎన్ఐటీహెచ్ఎంలో 120, శ్రీశక్తి ఐహెచ్ఎం(ప్రైవేట్ కళాశాల)లో 120, మెదక్‌లోని స్టేట్ గవర్నమెంట్ ఐహెచ్ఎంలో 60 సీట్లు ఉన్నాయి.

ప్రోగ్రామ్‌లోని అంశాలు: బీఎస్సీ(హాస్పిటాలిటీ అండ్ హోటల్ అడ్మినిస్ట్రేషన్) ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఇందులో ఆరు సెమిస్టర్లు ఉంటాయి. ఈ ప్రోగ్రామ్‌లో ఫుడ్ ప్రొడక్షన్, ఫుడ్ అండ్ బెవరేజ్ సర్వీస్, ఫ్రంట్ ఆఫీస్ ఆపరేషన్, హౌస్ కీపింగ్, హోటల్ అకౌంటెన్సీ, ఫుడ్ సేఫ్టీ అండ్ క్వాలిటీ, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, ఫెసిలిటీ ప్లానింగ్, ఫైనాన్షియల్ మేనేజ్‌మెంట్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్, టూరిజం మార్కెటింగ్ అండ్ మేనేజ్‌మెంట్ తదితర అంశాలు బోధిస్తారు. ల్యాబ్ వర్క్‌లు కూడా ఉంటాయి.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంగ్లీష్ ఒక సబ్జెక్ట్‌గా ఏదేని గ్రూప్‌తో ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. 2024 సెప్టెంబరు 30 నాటికి సర్టిఫికెట్లు సబ్మిట్ చేయాల్సి ఉంటుంది. అడ్వాన్స్‌డ్ లెవెల్ జనరల్ సర్టిఫికెట్ ఎడ్యుకేషన్(జీసీఈ) ఎగ్జామినేషన్(లండన్/కేంబ్రిడ్జ్/శ్రీలంక) ఉత్తీర్ణులు; కేంబ్రిడ్జ్ యూనివర్సిటీ నుంచి హైస్కూల్ సర్టిఫికెట్ ఎగ్జామ్ ఉత్తీర్ణులు; నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్(ఎన్ఐఓఎస్)/స్టేట్ బోర్డ్ ఆఫ్ ఓపెన్ స్కూలింగ్ (ఎస్‌బీఓఎస్) నుంచి సీనియర్ సెకండరీ స్కూల్ ఎగ్జామినేష్ ఉత్తీర్ణులు; ఎన్‌సీవీటీ/ఎస్‌సీవీటీ గుర్తింపు పొందిన హెచ్ఎస్‌సీ ఒకేషనల్ ఎగ్జామినేషన్ ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వయోపరిమితి నిబంధనలు లేవు.

ఎన్‌సీహెచ్ఎం జేఈఈ వివరాలు: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. మొత్తం 200 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఇందులో న్యూమరికల్ ఎబిలిటీ అండ్ అనలిటికల్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ అండ్ లాజికల్ డిడక్షన్, జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్ అంశాల నుంచి ఒక్కోదానిలో 30 ప్రశ్నలు; ఇంగ్లీష్ లాంగ్వేజ్ నుంచి 60 ప్రశ్నలు; ఆప్టిట్యూడ్ ఫర్ సర్వీస్ సెక్టార్ నుంచి 50 ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. ప్రశ్న పత్రాన్ని హిందీ, ఇంగ్లీష్ మాధ్యమాల్లో ఇస్తారు. పరీక్ష సమయం మూడు గంటలు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1,000; ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.700; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.450
- **దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 31
- **కరెక్షన్ విండో ఓపెన్:** ఏప్రిల్ 2 నుంచి 5 వరకు
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, వరంగల్, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, విశాఖపట్నం
- **ఎన్‌సీహెచ్ఎం జేఈఈ తేదీ:** మే 11
- **వెబ్‌సైట్:** https://nchm.ntaonline.in/, https://exams.nta.ac.in/

జవహర్‌లాల్ నెహ్రూ వర్సిటీలో ఎంబీఏ

న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ(జేఎన్‌యూ) ఆధ్వర్యంలోని అటల్ బిహారీ వాజపేయి స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఆంత్రప్రెన్యూర్‌షిప్(ఏబీవీఎస్ఎంఈ)- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. క్యాట్ 2023 స్కోర్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. మొత్తం 75 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 50 శాతం; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 45 శాతం మార్కులు ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలు రాసేవారు/పరీక్షలు రాసి ఫలితాల కోసం చూస్తున్నవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. క్యాట్ 2023 స్కోర్ తప్పనిసరి. విదేశీ విద్యార్థులకు జీమ్యాట్ స్కోర్(కనీసం 500) ఉండాలి.

ఎంపిక ప్రక్రియ: క్యాట్ 2023 స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. సీట్ల సంఖ్యకు ఏడురెట్ల మందిని ఎంపిక చేసి గ్రూప్ డిస్కషన్స్, పర్సనల్ ఇంటర్వ్యూలకు పంపుతారు. క్యాట్ 2023 స్కోర్‌నకు 70 శాతం, గ్రూప్ డిస్కషన్స్ స్కోర్‌నకు 10 శాతం, పర్సనల్ ఇంటర్వ్యూ స్కోర్‌నకు 20 శాతం వెయిటేజీ ఇస్తూ మెరిట్ ప్రకారం తుది జాబితా రూపొందిస్తారు.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.2,000; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 28
- **వెబ్‌సైట్:** www.jnu.ac.in

ఏపీలో ఎస్ఏ, ఎస్జీటీ ఉద్యోగాలు

జాబ్ కార్నర్

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్.. వివిధ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్, సెకండరీ గ్రేడ్ టీచర్స్ ఖాళీల భర్తీకి టీచర్ రిక్రూట్‌మెంట్ టెస్ట్(టీఆర్‌టీ/డీఎస్సీ) 2024 నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా **4,579** ఎస్ఏ/ఎస్జీటీ ఉద్యోగాలు భర్తీ చేస్తారు.

ఖాళీలున్న విద్యాసంస్థలు: ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్, ట్రైబల్ వెల్ఫేర్.

పోస్టుల వివరాలు:

1. స్కూల్ అసిస్టెంట్స్(ఎస్ఏ): **2,299 పోస్టులు**
2. సెకండరీ గ్రేడ్ టీచర్స్(ఎస్జీటీ): **2,280 పోస్టులు**

ఉమ్మడి జిల్లాల వారీ ఖాళీలు

1. శ్రీకాకుళం: ఎస్జీటీ-104; ఎస్ఏ-130
2. విజయనగరం: ఎస్జీటీ-103; ఎస్ఏ-97
3. విశాఖపట్నం: ఎస్జీటీ-101; ఎస్ఏ-133
4. తూర్పుగోదావరి: ఎస్జీటీ-108; ఎస్ఏ-182
5. పశ్చిమ గోదావరి: ఎస్జీటీ-102; ఎస్ఏ-145
6. కృష్ణా: ఎస్జీటీ-103; ఎస్ఏ-111
7. గుంటూరు: ఎస్జీటీ-109; ఎస్ఏ-170
8. ప్రకాశం: ఎస్జీటీ-111; ఎస్ఏ-299
9. ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు: ఎస్జీటీ-104; ఎస్ఏ-140
10. చిత్తూరు: ఎస్జీటీ-101; ఎస్ఏ-97
11. కడప: ఎస్జీటీ-105; ఎస్ఏ-81
12. అనంతపురం: ఎస్జీటీ-107; ఎస్ఏ-164
13. కర్నూలు: ఎస్జీటీ-1022; ఎస్ఏ-550

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగం/సబ్జెక్టులో ఇంటర్, డీఈడీ/డీఎల్ఈడీ, బ్యాచిలర్ డిగ్రీ, పీజీ, బీఈడీ ఉత్తీర్ణులై ఉండాలి. ఎస్జీటీ పోస్టులకు బీఈడీ వారు అర్హులు.

వయోపరిమితి: ఓసీలకు 2024 జూలై 1 నాటికి 44 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వారికి 49 ఏళ్లు, దివ్యాంగులకు 54 ఏళ్లు గరిష్ఠ వయోపరిమితిగా నిర్ణయించారు.

ఎంపిక ప్రక్రియ: కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష, రిజర్వేషన్ రూల్ తదితరాల ఆధారంగా

దరఖాస్తు రుసుము: రూ.750


ఫీజు చెల్లింపునకు చివరి తేదీ: ఫిబ్రవరి 21

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఫిబ్రవరి 22

రాత పరీక్ష షెడ్యూల్: 2024 మార్చి 15 నుంచి 2024 మార్చి 30 వరకు

వెబ్‌సైట్: apdsc.apcfss.in

టీఎస్ ఈసెట్ నోటిఫికేషన్



తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి(టీఎస్‌సీహెచ్ఈ)- స్టేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(టీఎస్ ఈసెట్)2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. ఈ పరీక్షని హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ నిర్వహిస్తోంది. దీని ద్వారా బీఈ, బీటెక్, బీఫార్మసీ కోర్సులకు సంబంధించి రెండో సంవత్సరంలో (లేటరల్ ఎంట్రీ) ప్రవేశాలు కల్పిస్తారు. ఈసెట్‌లో సాధించిన ర్యాంక్ ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్, మైనారిటీ, నాన్ మైనారిటీ ప్రొఫెషనల్ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పరీక్ష సిలబస్, మాక్ టెస్ట్‌ల కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.

ఈసెట్ 2024 విభాగాలు: సివిల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్, కెమికల్, మెటలర్జికల్, మైనింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్, ఫార్మసీ.

అర్హత: స్టేట్ బోర్డ్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్(టీఎస్/ఏపీ) నుంచి ఇంజనీరింగ్/ టెక్నాలజీ/ఫార్మసీ విభాగాల్లో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. మేథమెటిక్స్ ఒక సబ్జెక్ట్‌గా మూడేళ్ల బీఎస్సీ ఉత్తీర్ణులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు బీఫార్మసీ కోర్సుకు అనర్హులు. డిప్లొమా/డిగ్రీ స్థాయిలో కనీసం 45 శాతం మార్కులు ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 40 శాతం మార్కులు చాలు.

ఈసెట్ 2024 వివరాలు: పరీక్ష సమయం మూడు గంటలు. మొత్తం మార్కులు 200.

- డిప్లొమా అభ్యర్థులకు నిర్వహించే పరీక్షలో మేథమెటిక్స్ నుంచి 50, ఫిజిక్స్ నుంచి 25, కెమిస్ట్రీ నుంచి 25, సంబంధిత ఇంజనీరింగ్ విభాగం(సివిల్/ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్/మెకానికల్/ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్/కంప్యూటర్ సైన్స్/కెమికల్/మెటలర్జికల్/మైనింగ్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్)నుంచి 100 మార్కులకు ప్రశ్నలు అడుగుతారు.
- బీఎస్సీ(మేథమెటిక్స్) అభ్యర్థులకు మేథమెటిక్స్ నుంచి 100, అనలిటికల్ ఎబిలిటీ నుంచి 50, కమ్యూనికేటివ్ ఇంగ్లీష్ నుంచి 50 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు.
- ఫార్మసీ అభ్యర్థులకు ఫార్మకాగ్నసీ, ఫార్మకాలజీ, ఫార్మాస్యూటిక్స్, ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ అంశాలనుంచి ఒక్కోదానిలో 50 మార్కులకు ప్రశ్నలు ఇస్తారు.
- ఈసెట్ 2024లో అర్హత పొందాలంటే కనీసం 50 మార్కులు రావాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ఈ నిబంధన వర్తించదు.

ముఖ్య సమాచారం

- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.900; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఏప్రిల్ 16
- **టీఎస్ ఈసెట్ 2024 తేదీ:** మే 6
- **వెబ్‌సైట్:** ecet.tsche.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/zQsa13eలో చదవండి.

ఐఐపీలో ఎంఎస్, పీజీ డిప్లొమా

ముంబైలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్(ఐఐపీ)- ఎంఎస్ ఇన్ ప్యాకేజింగ్ టెక్నాలజీ, పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఒక్కో కోర్సు వ్యవధి రెండేళ్లు. కోర్సుకు నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. సంస్థ నిర్వహించే కామన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఐఐపీ సెట్) 2024, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు.

ఎంఎస్ ఇన్ ప్యాకేజింగ్ టెక్నాలజీ: హైద్రాబాద్ క్యాంపస్‌లో 40 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్‌నకు హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూ) గుర్తింపు ఉంది.

పీజీ డిప్లొమా ఇన్ ప్యాకేజింగ్: ముంబై క్యాంపస్‌లో 280 సీట్లు, కోల్‌కతా క్యాంపస్‌లో 80 సీట్లు ఉన్నాయి.

అర్హత: ఎంఎస్ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఏఐసీటీఈ గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ/సైన్స్ విభాగాల్లో నాలుగేళ్ల డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. పీజీ డిప్లొమాలో ప్రవేశానికి గుర్తింపు పొందిన కళాశాల నుంచి ఫిజిక్స్/కెమిస్ట్రీ/మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్/మైక్రోబయాలజీ/బయోకెమిస్ట్రీ/లైఫ్ సైన్సెస్/మెటీరియల్ సైన్స్/బయోటెక్నాలజీ/జువాలజీ/బోటనీ/అగ్రికల్చరల్ సైన్సెస్/హార్టికల్చరల్ సైన్సెస్/వెటర్నరీ సైన్సెస్/డెయిరీ సైన్స్/ఫుడ్ సైన్స్ అండ్ అప్లయిడ్ న్యూట్రిషన్/ఎలక్ట్రానిక్స్/ఎన్విరాన్‌మెంట్ సైన్స్/పాలిమర్ కెమిస్ట్రీ/ఫిషరీ సైన్స్/నానో సైన్స్/ఫార్మాస్యూటికల్ సైన్స్ ఒక సబ్జెక్టుగా బీఎస్సీ పూర్తిచేసినవారు; బీఈ/బీటెక్/బీఫార్మసీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ద్వితీయ శ్రేణి మార్కులు తప్పనిసరి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమవుతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. కరస్పాండెన్స్, పార్ట్ టైమ్ డిగ్రీలు చేసినవారు దరఖాస్తుకు అనర్హులు. అభ్యర్థుల వయసు 2024 మే 31 నాటికి 30 ఏళ్లు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు; ఎస్సీ, ఎస్టీలకు అయిదేళ్లు వయోపరిమితి సడలింపు వర్తిస్తుంది.

ఐఐపీ సెట్ 2024 వివరాలు: దీనిని ఆఫ్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. అన్నీ మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలే ఇస్తారు. ఫిజిక్స్, కెమిస్ట్రీ, మేథమెటిక్స్, ఇంజనీరింగ్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ప్రశ్నలన్నీ డిగ్రీ స్థాయిలోనే ఉంటాయి. అభ్యర్థులు నిర్దేశిత సంఖ్య మేరకు ప్రశ్నలు ఎంచుకొని సమాధానాలు గుర్తించాలి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.500
- **చివరి తేదీ:** జూన్ 8
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, ముంబై, కోల్‌కతా, ఢిల్లీ, చెన్నై, అహ్మదాబాద్
- **ఐఐపీ సెట్ 2024 తేదీ:** జూన్ 16
- **పర్సనల్ ఇంటర్వ్యూలు:** జూన్ 28, 29
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** ఆగస్టు 5 నుంచి
- **వెబ్‌సైట్:** www.iip-in.com

నవ్య | చిత్రజ్యోతి

బెర్లిన్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు బన్నీ



'పుష్ప' చిత్రంతో ఉత్తమ నటుడిగా జాతీయ పురస్కారాన్ని అందుకొని సత్తా చాటారు అల్లు అర్జున్. ఇప్పుడు ఆయన మరో అరుదైన గౌరవాన్ని పొందారు. ప్రతిష్ఠాత్మక బెర్లిన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో భారతీయ సినిమా తరపున ప్రాతినిధ్యం వహించే అవకాశం అల్లు అర్జున్‌కు దక్కింది. 74వ బెర్లిన్ ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో పాల్గొనాల్సిందిగా ఆయనకు ఆహ్వానం అందింది. దీంతో గురువారం బన్నీ జర్మనీ వెళ్లారు. 'పుష్ప' సినిమాను ఈ చిత్రోత్సవాల్లో ప్రత్యేకంగా ప్రదర్శించనున్నారు. ప్రస్తుతం అల్లు అర్జున్ 'పుష్ప 2' చిత్రంలో నటిస్తున్నారు. ఆగస్టు 15న ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నట్లు నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ ప్రకటించింది.


అందాల రాశికి అందలం



అందం, అభినయం కలగలిసిన ముద్దుగుమ్మగా ప్రేక్షకలోకాన్ని ఆకట్టుకున్నారు టాలీవుడ్ కథానాయిక రష్మిక మందన్న. ఇప్పుడు ఆమె మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకున్నారు. ఫోర్బ్స్ ఇండియా 30 అండర్ 30 జాబితాలో రష్మిక చోటు దక్కించుకున్నారు. 30 ఏళ్లలోపు వయసు ఉన్న 30 మంది ప్రతిభావంతుల జాబితాలో రష్మిక అగ్రస్థానం దక్కించుకున్నారు. సోషల్ మీడియా ద్వారా రష్మిక ఈ విషయాన్ని అభిమానులతో పంచుకొని ఆనందం వ్యక్తం చేశారు. ఆమె ప్రస్తుతం అల్లు అర్జున్ సరసన 'పుష్ప 2' చిత్రంలో నటిస్తున్నారు. అలాగే 'రెయిన్ బో' 'ది గర్ల్‌ఫ్రెండ్' అనే హీరోయిన్ ఓరియంటెడ్ చిత్రాలు సెట్స్‌పై ఉన్నాయి.

రాజధాని ఫైల్స్‌కు తాత్కాలిక బ్రేక్

- రికార్డులు పరిశీలించాలి.. వాటిని మా ముందు ఉంచండి
- సీబీఎఫ్‌సీ, రివైజింగ్ కమిటీ అధికారులకు హైకోర్టు ఆదేశం
- విచారణ నేటికి వాయిదా



రాజధాని ఫైల్స్ సినిమా ప్రదర్శనను తాత్కాలికంగా నిలుపుదల చేస్తున్నట్లు హైకోర్టు గురువారం ప్రకటించింది. నిబంధనల ప్రకారం తగిన కారణాలు పేర్కొని సినిమా విడుదలకు రివైజ్ కమిటీ సర్టిఫికెట్ ఇచ్చిందా.. లేదా అనేది పరిశీలించాల్సి ఉందని అభిప్రాయపడింది. సినిమాకు సంబంధించి ఎగ్జామినింగ్ కమిటీ, రివైజింగ్ కమిటీల వద్ద ఉన్న రికార్డులను ఈ నెల 16లోగా కోర్టు పరిశీలనకు ఉంచాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ), రివైజింగ్ కమిటీ ప్రిసైడింగ్ ఆఫీసర్‌ను ఆదేశించింది. సినిమా విడుదలైతే పూడ్చుకోలేని నష్టం జరుగుతుందన్న పిటిషనర్ వాదనను పరిగణలోకి తీసుకొని సినిమా ప్రదర్శనపై శుక్రవారం వరకు స్టే విధిస్తున్నట్లు ప్రకటించింది. రికార్డులు కోర్టు ముందు ఉంచేందుకు వీలుగా విచారణను శుక్రవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.జయసూర్య గురువారం మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. ఏపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్ఠను దిగజార్చేలా రాజధాని ఫైల్స్ సినిమాను తీశారని, సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిలిం సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) ధృవపత్రాన్ని రద్దు చేయాలని కోరతూ వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై మంగళవారం విచారణ జరిపిన న్యాయస్థానం మధ్యంతర ఉత్తర్వులు జారీకి నిర్ణయాన్ని వాయిదా వేసింది. గురువారం సినిమా ప్రదర్శనను నిలువరిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.

థియేటర్లలో ప్రదర్శన నిలుపుదల

రాజధాని అమరావతి రైతుల ఉద్యమ నేపథ్యంలో తెరకెక్కిన 'రాజధాని ఫైల్స్' చిత్రానికి బ్రేకులు పడ్డాయి. న్యాయస్థానం ఆదేశాల మేరకు ఈ చిత్ర ప్రదర్శనను నిలుపుదల చేయాలని రెవెన్యూ అధికారులు థియేటర్ యాజమానులను ఆదేశించారు. గురువారం రిలీజైన ఈ చిత్రాన్ని ఉమ్మడి కృష్ణాలో 26 థియేటర్లతో పాటు కొన్ని మల్టీప్లెక్స్‌ల్లోనూ విడుదల చేశారు. ఉదయం ఆట మొదలయ్యే సరికి రెవెన్యూ అధికారులు థియేటర్లకు వచ్చి.. ప్రదర్శనలను నిలుపుదల చేయాలని ఆదేశించారు. రెవెన్యూ అధికారులు వెళ్లే సరికి కొన్ని థియేటర్లలో ప్రదర్శనలు మొదలయ్యాయి. ఆయా థియేటర్లలో మాత్రం మేనేజర్లు కోర్టు తీర్పు కాపీని ఇవ్వాలని రెవెన్యూ అధికారులను కోరారు. ఆ ఉత్తర్వులను టికెట్ కౌంటర్ల వద్ద అతికించారు. మ్యాట్నీ నుంచి పూర్తిగా నిలుపుదల చేయాలని ఆదేశించారు. ట్రెండ్‌సెట్‌లో ప్రదర్శనను మధ్యలోనే ఆపేయడంతో ప్రేక్షకులు ఆందోళనకు దిగారు. అధికారులు వారికి కోర్టు ఆదేశాలను చూపించడంతో ఆందోళన విరమించారు. కాగా, ఏలూరులోని విజయలక్ష్మి థియేటర్ (వి మాక్స్)లో ఈ సినిమా గురువారం 11 గంటలకు ప్రారంభం కాగా రెవెన్యూ, పోలీసు అధికారులు వచ్చి ప్రేక్షకులను పంపించి వేశారు.

అమరావతి (ఆంధ్రజ్యోతి)



భైరవకోన బావుందంటున్నారు



"ఊరుపేరు భైరవకోన' చిత్రానికి వంద ప్రీమియర్ షోలు పడ్డాయి. ప్రేక్షకుల నుంచి అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. 'సినిమా హిట్. చాలా బావుంది' అంటున్నారు" అని సందీప్ కిషన్ అన్నారు. ఆయన కథానాయకుడిగా వీఐ ఆనంద్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఊరుపేరు భైరవకోన'. అనిల్ సుంకర సమర్పణలో రాజేశ్ దండా నిర్మించారు. ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రెస్‌మీట్ నిర్వహించింది. అనిల్ సుంకర మాట్లాడుతూ "ఊరుపేరు భైరవకోన' ప్రీమియర్స్‌కు ఇలాంటి స్పందన ముందే ఊహించాం. సినిమా అద్భుతంగా ఉందని ప్రేక్షకులు చెప్పడం విజయంపై నమ్మకాన్ని పెంచింది' అని చెప్పారు. వీఐ ఆనంద్ మాట్లాడుతూ 'ప్రీమియర్ షోస్ అన్నీ హౌస్ ఫుల్ అయ్యాయి. ప్రేక్షకులను మెప్పించినందుకు ఆనందంగా ఉంద'న్నారు. రాజేశ్ దండా మాట్లాడుతూ 'రెండున్నరేళ్లు కష్టపడి ఈ సినిమా చేశాం. కంటెంట్‌ను నమ్మి వంద ప్రీమియర్ షోస్ వేశాం. రూ. కోటి పైన వసూళ్లు రావడం ఈ సినిమా క్రేజ్‌కు నిదర్శనం' అని పేర్కొన్నారు. 'ఊరు పేరు భైరవ కోన' సినిమా విడుదలపై స్టే ఇవ్వాలని దాఖలైన పిటిషన్‌లో స్టే ఇవ్వడానికి హైకోర్టు నిరాకరించింది.

పద్మవ్యూహంలో ప్రేమకథ



ప్రవీణ్ రాజ్‌కుమార్ హీరోగా శశికాటిక్కో, ఆషు రెడ్డి కీలకపాత్రల్లో నటిస్తున్న చిత్రానికి టైటిల్ ఖరారైంది. సంజయ్‌రెడ్డి బంగారపు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి 'పద్మవ్యూహంలో చక్రధారి' అనే టైటిల్‌ను చిత్రబృందం నిర్ణయించింది. ప్రవీణ్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ 'ప్రతి ఒక్కరి జీవితంలో తొలి ప్రేమ ఉంటుంది. అందులో కొందరు సఫలం అయితే మరికొందరు విఫలమవుతారు. అలా తన తొలిప్రేమ జ్ఞాపకాల నుంచి బయటపడి జీవితంలో ముందుకు సాగడానికి ఓ వ్యక్తి అనుభవించిన సంఘర్షణ నేపథ్యంలో ఈ చిత్రం తెరకెక్కుతోంద'న్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'రాయలసీమ అనగానే పగ, ప్రతీకారాలు మాత్రమే అనేలా ప్రచారంలో ఉంది. కానీ మా చిత్రంలో ఈ ప్రాంతంలో ఉన్న స్వచ్ఛమైన ప్రేమని చూపించబోతున్నాం' అన్నారు.

హర్షను హీరోగా ఆదరించండి

చిరంజీవి

సుందరం మాస్టర్ చిత్రం ట్రైలర్ చాలా బావుంది. హర్ష కోసమే ఈ పాత్ర పుట్టినట్లుంది. తన ప్రతిభను నమ్ముకొని హర్ష ఓ స్థాయికి వచ్చాడు. ఇప్పుడు హీరోగా ఎదిగాడు. హాస్యంతో పాటు ఆకట్టుకునే భావోద్వేగాలు ఉన్న సినిమా ఇది. ఇలాంటి వినూత్న ప్రయోగాలను ప్రేక్షకులు ఆదరించాలి. 'సుందరం మాస్టర్' చిత్రానికి పెద్ద విజయాన్ని అందించాలి' అని చిరంజీవి ప్రేక్షకులను కోరారు. హర్ష చెముడు, దివ్యశ్రీ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సుందరం మాస్టర్'. హీరో రవితేజ, సుధీర్



కుమార్ సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రం ఈనెల 23న విడుదలవుతోంది. గురువారం చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ప్రస్తుతం అమెరికా విహార యాత్రలో ఉన్న చిరంజీవి ఆన్‌లైన్‌లో ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా హర్ష మాట్లాడుతూ "సుందరం మాస్టర్' చిత్రం చాలా కొత్త పాయింట్‌తో రాబోతోంది. మనలో ఒకడిగా ఈ చిత్రంలో కనిపిస్తాను. అందరినీ ఆలోచింపజేసే చిత్రమిది. కామెడీతో పాటు అద్భుతమైన డ్రామా ఉంది' అన్నారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/Asbx5Tv లో చదవండి.

తెనాలి జీజీహెచ్‌లో ప్రపంచ బ్యాంకు బృందం ...



తెనాలి జిల్లా ప్రభుత్వవైద్యశాలను గురువారం వరల్డ్ బ్యాంక్ టీం సభ్యులు సందర్శించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, రోగులకు అందుతున్న సేవలపై ఆసుపత్రి సూపరింటెండెంట్ సౌభాగ్యవాణినితో చర్చించారు. ఈ సభ్యుల బృందం మూడు రోజులు ఆసుపత్రిని సందర్శించనున్నదని వైద్యశాల సూపరింటెండెంట్ సౌభాగ్యవాణి తెలిపారు.
- తెనాలి రూరల్

బరితెగించిన వైసీపీ ఇసుక దొంగలు

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 15: రాష్ట్రంలో వైసీపీ ఇసుక దొంగలు రోజురోజుకు మరీ బరితెగిస్తున్నారని మాజీమంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు ఆందోళన వ్యక్తంచేశారు. పట్టణంలోని ఆయన నివాస గృహంలో గురువారం ప్రత్తిపాటి మీడియాతో మాట్లాడారు. ఇసుక అక్రమాలు నిజం అడ్డగోలు తవ్వకాలు వాస్తవమని కేంద్ర ప్రభుత్వమే హైకోర్టుకు తెలిపిందంటే ఇక్కడ పరిస్థితి ఏ స్థాయికి చేరిందో అర్థం చేసుకోవచ్చన్నారు. తాడేపల్లి ప్యాలెస్ అండ చూసుకొని ప్రశ్నించిన వారిని కొట్టడానికి, చంపటానికి కూడా ఈమాఫియా వెనుకాడటం లేదన్నారు. మాఫియా విషయాలను వెల్లడించే విలేకరులను పట్టి బంధించి హత్యాయత్నాలు చేయడం చాలా ప్రమాదకర పరిణామం అన్నారు. రోజుకు రెండు వేలకు పైగా లారీలతో ఇసుక ఇక్కడి నుంచి బయట రాష్ట్రాలకు తరలి పోతోందని, రూ.600 కోట్ల నుంచి రూ.700 కోట్ల వరకు నెలకు ఇసుక అక్రమాలు చోటు చేసుకుంటున్నాయని, చాలా కాలం క్రితం తమ పార్టీ ఈ విషయాన్ని వెలుగులోకి తీసుకు వచ్చిందని ఈ సందర్భంగా ప్రత్తిపాటి గుర్తు చేశారు. ఇసుక దీక్షల పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు, ఇసుక రీచ్‌ల సందర్శనలు చేపడితే పోలీసు పవర్‌తో అడ్డుకున్న జగన్ ప్రభుత్వం తమ దోపిడీ పర్వాన్ని యథేచ్ఛగా సాగిస్తుందన్నారు.

క్రైస్తవులకు మొండిచేయి చూపిన జగన్‌రెడ్డి

● డాక్టర్ జోసఫ్ పీ.మోసిగంటి



జోసఫ్ పీ మోసిగంటి

చేబ్రోలు, ఫిబ్రవరి15: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 25 శాతంగా ఉన్న క్రైస్తవ ఓట్లతో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి క్రైస్తవులను మొండిచేయి చూపారని ఆంధ్రప్రదేశ్ జీసెస్ బిలీవర్స్ అసోసియేషన్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ జోసఫ్ పీ. మోసిగంటి గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. జగన్ తమ వాడు అనుకొని 98శాతం మంది క్రైస్తవులు ఓట్లు వేశారన్నారు. గెలిపించిన తర్వాత కనీసం కృతజ్ఞత చూపలేదన్నారు. నామినేటెడ్ పోస్టులు, కోఆప్టెడ్ పోస్టులు దాదాపు 800 వరకు ఉండగా ఏ ఒక్కటీ క్రైస్తవ సమాజానికి సేవ చేసేవారికి ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో 80వేల మంది పాస్టర్లు ఉంటే కేవలం 8,500 మందికి మాత్రమే రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం చేసి చేతులు దులుపుకొన్నారని ఆరోపించారు. వైసీపీ ప్రభుత్వంలో చర్చిల మీద, క్రైస్తవుల మీద దాడులు పెరిగాయని ఆరోపించారు. ఇంతకు ముందు బైబిల్ ఇచ్చి అమ్మను, చెల్లిని పంపిన జగన్ ఇప్పుడు విమలారెడ్డిని పంపిస్తున్నారని ఆరోపిస్తున్నారు. గత నాలుగున్నర ఏళ్లగా విమలారెడ్డి ఒక్క క్రైస్తవ సమస్య మీద కూడా స్పందించలేదని ఆరోపించారు. క్రైస్తవ సమాజం అప్రమత్తంగా ఉండి ఇలాంటి వారిని నిలదీయాలని డాక్టర్ జోసఫ్ పీ మోసిగంటి సూచించారు.

మేటల్లోనూ.. మేత

● కృష్ణానదిని ఖాళీ చేసి, పట్టా భూములపై పడ్డారు
● పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలను నిషేధించిన ప్రభుత్వం
● అయినా అనుమతులు లేకుండా అడ్డగోలు తవ్వకాలు
● రైతులను మభ్యపెట్టి డబ్బు ఆశ చూపించి ఇసుక స్వాహా



లారీలను వదిలేసి ట్రాక్టర్లను తీసుకు వెళుతున్న ఎస్‌ఈబీ అధికారి

కొల్లూరు, ఫిబ్రవరి 15: కృష్ణానదిలో ఇసుక రేణువు లేకుండా ఖాళీ చేశారు.. రైతుల పట్టా భూముల్లో వేసిన ఇసుక మేటలపై పడ్డారు. ప్రభుత్వం పట్టా భూముల్లో ఇసుక మేటల తవ్వకాలు నిషేధించింది. తమకు అటువంటివేమి వర్తించవంటూ అడ్డగోలుగా భారీ యంత్రాలతో రైతులకు డబ్బు ఆశ చూపించి భారీ యంత్రాలతో అక్రమంగా ఇసుక తవ్వేసి జేబులు నింపుకొంటున్నారు. బాపట్ల జిల్లా కొల్లూరు మండలం పెసర్లంకలో అరవింద వారధి ఎగువన రైతుల భూముల్లో వరదలకు నదీపాతానికి గురయ్యే వాటిలో వరదల సమయంలో ఇసుక మేటలు భారీగా ఏర్పడ్డాయి. వైసీపీ ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఉచిత ఇసుక విధానాన్ని రద్దు చేసింది. నదుల్లో ఉన్న ఇసుక తవ్వకాలు రాష్ట్రాన్ని మూడుగా విభజించి గుంపగుత్తగా జేపీ సంస్థకు అప్పగించింది. జేపీ సంస్థ కాలపరిమితి తీరిపోయిన ఇసుక తవ్వకాలు చేస్తున్నారంటూ టీడీపీ వారి అక్రమాలను బయటకు తీయడంతో ప్రభుత్వం మరో సంస్థకు ఇసుక తవ్వకాలకు అప్పగించింది. అయితే కొల్లూరు మండలం గాజుల్లంక పరిధిలో ఉన్న కృష్ణా నదిలో ఎక్కడా ఇసుక లేకపోవడంతో జీసీకేసీ కన్ను నదీ అంచున ఉన్న పట్టా భూముల్లో వేసిన ఇసుక మేటలపై పడింది. దీంతో ఆయా రైతులతో బేరసారాలు సాగించి ఎకరం భూమిలో వేసిన ఇసుక మేటలు తొలగింపు రూ.1.70 లక్షలు రైతులకు చెల్లించే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఒప్పందం అయిన వెంటనే భారీ యంత్రాలతో ఇసుక తవ్వకాలను ప్రారంభించారు. అయితే నిషేధించిన పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలను గ్రామస్తులు అడ్డుకుని అనుమతులు చూపించాలని సంస్థ నిర్వాహకులను ప్రశ్నించగా నదిలో ఇసుక తవ్వకాలను ఇచ్చిన అనుమతులను చూపిస్తూ అడ్డుకుంటున్న వారిని డబ్బు ఎర వేస్తూ ఇసుక తవ్వకాలను కొనసాగిస్తున్నారు. భారీ యంత్రాలతో అక్రమంగా జరుగుతున్న ఇసుక తవ్వకాల వల్ల సాగు, తాగు నీటి ఇబ్బందులు తలెత్తడంతో పాటు వరదల సమయంలో పంట పొలాలు, గ్రామాలు కోతకు గురవుతాయని రైతులు, గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వారి ఎవరూ లెక్కచేయకపోగా ఇష్టానుసారంగా భారీ గోతులు పెట్టి మరీ ఇసుక తవ్వకాలు చేస్తున్నారు. ఇప్పటికైనా లంక గ్రామాల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని అక్రమ ఇసుక తవ్వకాలను నిలువరించాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



పట్టా భూముల్లో జరిగిన ఇసుక తవ్వకాలు

దాడుల్లోనూ దాపరికం..

అరవింద వారధి సమీపంలో అక్రమ ఇసుక తవ్వకాలు చేస్తున్నారంటూ లంక గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మైనింగ్, ఎస్‌ఈబీ అధికారులు గురువారం మధ్యాహ్నం ఇసుక రీచ్‌పై ఆకస్మిక దాడి చేశారు. దాడుల్లో మూడు భారీ యంత్రాలతో పాటు లారీలు, ట్రాక్టర్లు పంపించి వేసి భారీ యంత్రాలను సీజ్ చేస్తున్నట్లుగా మైనింగ్ ఏడీ రాజేష్‌కుమార్ విలేకర్లకు తెలిపారు. లోడ్ అయి వున్న 15 లారీలను విడిచి పెట్టి రెండు ట్రాక్టర్లను మాత్రం వే బిల్లులు లేవంటూ కొల్లూరు పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. దాడులపై వివరణ కోరినా సరైన సమాధానం ఇవ్వలేదు. అక్రమ ఇసుక తవ్వకాలను అడ్డుకునే బాధ్యత సెబ్ అధికారులు తీసుకుని వారు నియంత్రించాలంటూ తమ బాధ్యత కాదన్న రీతిలో సమాధానం ఇవ్వడంతో పాటు విలేకర్లకు భారీ యంత్రాలు మూడింటిని సీజ్ చేసినట్లుగా పోలీసులకు నివేదిక ఇచ్చామని చెప్పి వెళ్లిపోయారు. ఈ విషయంపై ఏఎస్‌ఐ అర్జున్‌ను వివరణ కోరగా మైనింగ్ శాఖ అసిస్టెంట్ జియాలజిస్టు రాజేష్‌కుమార్ వేబిల్లులు లేకుండా వెళుతున్న రెండు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని తమకు అప్పగించినట్లుగా మాత్రమే తమకు రిపోర్టు ఇవ్వడం జరిగిందన్నారు. యంత్రాల సంగతి తమకు తెలియదంటూ వివరించారు. ఇసుక తవ్వకందారులు మాత్రం మైనింగ్, సెబ్ అధికారులు వెళ్లిన వెంటనే మళ్లీ భారీ యంత్రాలను పట్టా భూముల్లోకి తీసుకెళ్లి తవ్వకాలు చేపట్టారు. అక్రమ ఇసుక తవ్వకాలతో పాటు ఇసుక మాఫియాకు పూర్తి అండదండాలు అధికార పార్టీ నేతలతో పాటు ఇసుక మాఫియా వద్ద నుంచి మైనింగ్, సెబ్ అధికారులకు ముడుపులు అందుతున్నట్లు సమాచారం. ఎవరైనా ఫిర్యాదు చేస్తే వచ్చి హడావుడి చేసి ఫిర్యాదు చేసి తమ పని అయిపోయినట్లుగా చెప్పి వెళ్లిపోతున్నారు. ఇందుకు ఉదాహరణగా మైనింగ్ ఏడీ మూడు భారీ యంత్రాలను సీజ్ చేయకుండానే చేశామంటూ నమ్మబలికి పోలీస్‌స్టేషన్‌లో మాత్రం కేవలం రెండు ట్రాక్టర్లు అప్పగించడంతో ఇసుక మాఫియాదారులకు వారి సహాయ సహకారాలు పూర్తిగా ఉన్నాయని ఈ చర్యతో స్పష్టమైంది.



ఇసుక తవ్వకాలు నిలిపి యంత్రాలను ఒడ్డుకు తరలించిన మైనింగ్ అధికారులు

వివాహిత దారుణ హత్య



అలేఖ్య(ఫైల్)

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 15: వివాహిత దారుణ హత్యకు గురైన ఘటన పట్టణంలోని గంగానమ్మపేటలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భవనంవారి వీధిలో నివాసం ఉంటున్న రామిశెట్టి అలేఖ్య(35)కు ఆడిటర్‌గా పనిచేసే రమేష్‌తో 15 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వారికి ఇద్దరు సంతానం. కాగా అన్నంశ్రీనివాస్ అనేవ్యక్తి తన భార్యను కొంతకాలంగా వేధిస్తున్నాడని రమేష్ తెలిపాడు. బుధవారం రాత్రి ఇంటిలో పై గదిలో రమేష్ నిద్రించాడు. కింది గదిలో భార్య అలేఖ్య నిద్రించింది. ఉదయం లేచి చూసే సరికి అలేఖ్య మృతదేహం నగ్నంగా పడి ఉందని గమనించి భర్త పోలీసులకు ఫిర్యాదుచేశాడు. ఆమెను పదునైన ఆయుధంతో గొంతు కోసి హత్య చేశారు. శ్రీనివాస్‌కి ఈఘాతుకానికి పాల్పడ్డాడని రమేష్ చెబుతున్నాడు. వివాహేతర సంబంధం నేపథ్యంలోనే ఈ హత్య జరిగిందని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సుధాకర్ చెప్పారు.

వైసీపీకి దొడ్డక దంపతుల రాజీనామా



దొడ్డక కృష్ణ, శివపార్వతి

మంగళగిరి, ఫిబ్రవరి15: మంగళగిరి మండలం నవులూరు గ్రామానికి చెందిన మార్కెట్ యార్డు మాజీ చైర్‌పర్సన్ దొడ్డక శివపార్వతి, దొడ్డక కృష్ణ దంపతులు వైసీపీకి రాజీనామా చేస్తున్నట్లు గురువారం ప్రకటించారు. తమను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి మనుషులుగా భావించి, పార్టీ కార్యక్రమాలకు దూరం పెడుతున్నారని తెలిపారు. తాము వైసీపీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం కష్టపడుతున్నామని, ఇతర పార్టీల నుంచి వచ్చిన వారిని అందల మెక్కించి తమకు కనీస గుర్తింపు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. పార్టీలో జరుగుతున్న పరిణామాలకు తీవ్ర మనస్తాపంతో రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

హత్య కేసులో భర్తకు జీవిత ఖైదు

గుంటూరు, ఫిబ్రవరి 15: భార్యను హత్య చేసిన కేసులో నిందితుడైన భర్తకు జీవిత ఖైదు విధిస్తూ మెజిస్ట్రేట్ తీర్పు ఇచ్చారు. గురువారం నగరం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో 2018లో జరిగిన హత్య కేసులో నిందితుడైన మాదల సాంబశివరావు అనే నిందితునికి నేరం రుజువు కావడంతో అతనికి జీవితకాలం కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేలు జరిమానా విధించినట్లు ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. ఈ కేసులో దర్యాప్తు అధికారి అయిన ఇన్‌చార్జి సీఐ శ్రీనివాస్ రావు, ప్రస్తుతం సీఐడీ డీఎస్పీగా పని చేస్తున్నారని, ప్రాసిక్యూషన్ తరుపున పీపీ అయిన వెంకటరెడ్డి వాదనలను వినిపించారని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. ఈ కేసులో దర్యాప్తు అధికారి, అందుకు సంబంధించిన పోలీసు సిబ్బందిని ఎస్పీ తుషార్ డూడీ అభినందించారు. జిల్లాలో పోలీసు అధికారులే స్వయంగా గ్రేవ్ కేసులలో కోర్టు ట్రయిల్‌ను పర్యవేక్షించడం వలన నిందితులకు కోర్టుల ద్వారా వేగంగా శిక్షలు పడుతున్నాయని ఎస్పీ తుషార్ డూడి తెలిపారు.

వాస్తవాలను తట్టుకోలేక పోతున్నాడు

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు



నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 15: వాస్తవ సన్నివేశాలను కళ్ళకు కట్టినట్టుగా ప్రజల ముందుకు తీసుకువచ్చిన రాజధాని ఫైల్స్ సినిమాచూసి సైకో సీఎం జగన్‌రెడ్డి గుండెల్లో రైళ్ళు పరిగెత్తుతున్నా యని టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అధికారం అడ్డుపెట్టుకొని సినిమాను నిలిపివేయడం ఆయన నీచ చరిత్రకు నిదర్శనమన్నారు. ఒక సినిమాను చూసి ముఖ్యమంత్రి భయపడటం రాష్ట్ర చరిత్రలో ఇదే తొలిసారి అన్నారు. రాష్ట్ర రాజధాని విషయంలో రాజధాని రైతు లను జగన్‌రెడ్డి అరాచకపాలన చేసిన దుర్మార్గాలను, దౌర్జన్యా లను, దాడులను వాస్తవ సన్నివేశాలకు దగ్గరగా చూపారనే అక్కసుతో సినిమాను అడ్డుకుంటున్నారని అన్నారు. రాజధాని నిర్మించటం చేత కాక ఓటమి భయం పట్టుకున్న జగన్‌రెడ్డి ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు.

రాజధాని ఫైల్స్ సినిమాతో జగన్‌కు వణుకు

● రేపల్లె ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్



రేపల్లె, ఫిబ్రవరి 15: రాజధాని ఫైల్స్ సినిమాకు జగన్‌రెడ్డి వెన్నులో వణుకు పుడుతుందని ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక బాధ్యతతో సినిమా తీస్తే జగన్‌రెడ్డికి వచ్చిన నష్టం ఏమిటని ప్రశ్నించారు. 34వేల మంది రైతుల త్యాగాలకు వాస్తవ రూపంగా నిలిచింది. అసెంబ్లీ సాక్షిగా అమరావతికి మద్దతు తెలిపిన జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక మూడు రాజధానుల పేరుతో మాటమార్చాడన్నారు. జగన్‌రెడ్డికి ఓటమి భయం పట్టుకుంది కాబట్టి సైకో చేష్టలు చేస్తున్నారన్నారు. నిన్నటి దాకా మూడు రాజధానుల పాట పాడిన వైసీపీ నేడు హైదరాబాద్ ఉమ్మడి రాజధాని అంటుందని అన్నారు. పక్క రాష్ట్రాల దగ్గర రాజధాని కావాలని అడుక్కునే స్థాయికి ఏపీని దిగజార్చారన్నారు. ఈ ఐదేళ్ళలో దోచుకోవటం దాచుకోవటం తప్పా రాష్ట్రానికి చేసింది ఏమీ లేదని అన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

● సూళ్లూరుపేట వద్ద లారీ ఢీకొని మృతి



గిరిధర్‌రెడ్డి(ఫైల్)

చిల్లకూరు, ఫిబ్రవరి 15: తిరుపతి జిల్లా చిల్లకూరు మండలంలోని టోల్‌ప్లాజా సమీపంలోని చుట్టుగుంట ప్రాంతంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు దుర్మరణం చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గుంటూరు జిల్లా పెదకాకాని గ్రామానికి చెందిన గిరిధర్‌రెడ్డి (22) మూడేళ్లుగా సూళ్లూరుపేటలోని శ్రీసిటీలో పని చేస్తున్నాడు. స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై సూళ్లూరుపేట నుంచి బయల్దేరగా చుట్టుగుంట వద్దకొచ్చేసరికి వెనుక నుంచి లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో గిరిధర్‌రెడ్డి అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి వికాసానికి సాహిత్య పఠనం అవసరం

● సామాజిక చైతన్యానికి నవలలు దోహదం
● ప్రముఖ వేదకవి జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు



ప్రసంగిస్తున్న కవి జొన్నవిత్తుల రామలింగేశ్వర రావు

పెదకాకాని, ఫిబ్రవరి 15 : విద్యార్థి వికాసానికి సాహిత్య పఠనం అవసరం అని ప్రముఖ వేద కవి, సినీ గేయ రచయిత జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు అన్నారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో గత రెండు రోజులుగా తెలుగు ప్రాచ్య భాష విభాగం ఆధ్వర్యంలో యూజీసీ సౌజన్యంతో 'సంస్కృతాంధ్ర నవలా సాహిత్యం- సామాజిక చైతన్యంపై జాతీయ సదస్సు' నిర్వహిస్తున్నారు. గురువారం రెండవ రోజు కార్యక్రమంలో జొన్నవిత్తుల రామలింగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో చెడును తుంచడానికి పుట్టినదే అసలైన కవిత్వం అనీ, ధర్మావేశమే రచనకు బీజం అని అన్నారు. రచయితలు తమ భావాలను ఆలోచనాత్మకంగా అర్థవంతంగా అక్షరాలుగా మలచి మంచి సాహిత్యాన్ని అందిస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు వేయి పడగలు వంటి ప్రముఖ రచనలను చదవాలని తద్వారా వారికి సమాజంపై సరైన ఆలోచన దృక్పథం ఏర్పడుతుందని తెలిపారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం లోని తెలుగు ప్రాచ్యభాష విభాగం ఎంతో విశిష్టత కలిగిన 'సంస్కృతాంధ్ర నవలా సాహిత్యం-సామాజిక చైతన్యంపై జాతీయ సదస్సు'ను నిర్వహించడం ఎంతో అభినందనీయమని ప్రశంసించారు. విద్యార్థులు ప్రతీ నిత్యం ఒక్క పేజీ అయినా సాహిత్యానికి సంబంధించిన రచనలు చదవడం అలవాటు చేసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. సామాజిక చైతన్యానికి నవలలు ఎంతగానో దోహద పడతాయని విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమానికి వర్సిటీ వీసీ ఆచార్య పి రాజశేఖర్, విభాగాధిపతి, సదస్సు సంచాలకురాలు ఆచార్య ఇ. మాధవి, పాఠ్య ప్రణాళికా మండలి ఛైర్మన్ ఆచార్య ఎన్.వి. కృష్ణారావు, డాక్టర్ యశ్వంత్ రెడ్డి, డాక్టర్ పవన్, డాక్టర్ పీ.వాసు, డాక్టర్ లలిత కుమారి, డాక్టర్ బలరాం, పరిశోధకులు, వందలాది మంది విద్యార్థులు విశేషంగా పాల్గొన్నారు.



వెంకటపాలెం రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

రాజధాని అమరావతి శాశ్వతం..

● 1521వ రోజుకు రాజధాని రైతుల ఆందోళనలు

తుళ్ళూరు, ఫిబ్రవరి 15: ప్రభుత్వాలు మారుతుంటాయి.. కానీ రాజధాని అమరావతి శాశ్వతమని రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్, మూడు రాజధానులు వద్దు అంటూ రైతులు రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు గురువారం నాటికి 1521వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి పలువురు రైతులు మాట్లాడుతూ సంక్షేమ పథకాల పేరుతో వైసీపీ నేతలు వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. సీఎం జగన్‌రెడ్డి రాజధాని రైతులపై ఎందుకు వివక్షత చూపుతున్నారో సమాధానం చెప్పాలన్నారు. మూడు రాజధానులని ఆంధ్రప్రదేశ్ ఉనికినే సీఎం జగన్‌రెడ్డి దెబ్బ తీశారన్నారు. వైసీపీ పాలకుల అవినీతితో వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను కోలుకోలేని విధంగా దెబ్బతీశారన్నారు. ఇటువంటి అబద్ధాల, ఆర్థిక ఉన్మాదికి ఒక్క క్షణం కూడా రాష్ట్రాన్ని పాలించే అర్హత లేదన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు.



సంగం డెయిరీని పరిశీలిస్తున్న కేరళ రాష్ట్ర డెయిరీ కో-ఆపరేటీవ్ సమాఖ్య మిల్మా చైర్మన్ కేఎస్ మణి తదితరులు

సంగం డెయిరీ సహకారం మరువలేనిది

● మిల్మా చైర్మన్ కేఎస్ మణి .. డెయిరీ సందర్శన

చేబ్రోలు, ఫిబ్రవరి15: గత రెండేళ్లుగా కేరళ రాష్ట్ర డెయిరీ కోఆపరేటీవ్ సమాఖ్య మిల్మాకు సంగం డెయిరీ అందచేస్తున్న సహకారం మరువలేనిదని ఆ సంస్థ ఛైర్మన్ కేఎస్ మణి అన్నారు. గురువారం కేరళ మిల్మా ఛైర్మన్ మణి, ఆ రాష్ట్ర పాల సంఘాల ఛైర్మన్లు, మేనేజింగ్ డైరెక్టర్లు సంగం డెయిరీని సందర్శించారు. ఈ సందర్భంగా సంగం డెయిరీలో పాల ప్రాసెసింగ్ యూనిట్లు, పాలు, పాల పదార్థాల తయారీ, ప్యాకింగ్, కోల్డ్ స్టోరేజీలు, రవాణా యూనిట్లను సందర్శించారు. అనంతరం సంగం ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్, ఎండీ పి.గోపాళ్ల కృష్ణను మణి తదితరులను సత్కరించారు. అనంతరం మణి మాట్లాడుతూ సంగం డెయిరీ ఉద్యోగుల సామర్థ్యంతో ప్లాంట్ నిర్వహణ తదితర అంశాలు అధునాతన పద్ధతులతో సాగిస్తున్నట్లు అభినందించారు. తమకు సహకరిస్తున్న ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్‌కు మిల్మా అధికారులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే మిల్మాను సందర్శించాలిందిగా ఛైర్మన్ నరేంద్రకుమార్, అధికారులను కోరారు. కార్యక్రమంలో మిల్మా బృందం, సంగం డెయిరీ వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

పిన్నెల్లి సోదరులను ప్రజలు తరిమికొడతారు

● టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారూ నాయక్

గుంటూరు, ఫిబ్రవరి 15: రాక్షసుల మాదిరిగా ప్రవర్తిస్తున్న పిన్నెల్లి సోదరులను తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యకుడు ఎం.ధారూనాయక్ హెచ్చరించారు. మాచర్ల నియోజకవర్గం దుర్గి మండలం పాటిమీద జంగమేశ్వరపురం గ్రామంలో వైసీపీకి చెందిన దుండగులు తెలుగుదేశం పార్టీకి చెందిన నలుగురు కార్యకర్తలపై దాడి చేసి నరకటం అమానుషమన్నారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో టీడీపీకి చెందిన బీసీ నాయకులను 7 గురిని చంపారన్నారు. గతంలో అదే గ్రామంలో కంచర్ల జల్లయ్య యాదవ్‌ని చంపారన్నారు. ఐదుగురి కాళ్లు నరికారన్నారు. ఇళ్లు తగులబెట్టారన్నారు. పొలాలు వేసుకోకుండా బయట నివసిస్తున్నారన్నారు. మళ్లీ ఇప్పుడు నలుగురి కాళ్లు నరికారన్నారు. వారిలో కొంతమంది చావు బతుకుల్లో ఉన్నారన్నారు. ఈ విధంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల మీద దాడులు చేస్తూనే ఉన్నారన్నారు. దీనిని ప్రజాస్వామ్య వాదులందరూ ఖండించాలన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇలాంటి రౌడీలను తరిమి కొట్టాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ బస్సులో బంగారం చోరీ

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 15: ఆర్టీసీ బస్సులో సుమారు 30 సవర్ల బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు బాధితురాలు హైదరాబాద్‌కు చెందిన షహనాజ్ మొదటి పట్టణ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. సీఐ కృష్ణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..చిలకలూరిపేటకు చెందిన షహనాజ్ వినుకొండలో బంధువుల పెళ్లికి వెళ్లి వస్తుండగా ఈ ఘటన జరిగింది. ఆభరణాలు ఏ ప్రదేశంలో చోరీకి గురైయ్యాయో సీసీ పుటేజీలు పరిశీలిసున్నామని పోలీసులు తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.39 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	138, 147,158
చికెన్ విత్ స్కిన్	264.00
చికెన్ స్కిన్ లెస్	274.00

1,19,823 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఫిబ్రవరి 15 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,24,248 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,19,823 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 94,535 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	20000
నెంబరు. 5	11500	15500
273	12500	16000
341	11000	20500
4884	9000	14500
సూపర్ 10	9000	16000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	21200
బ్యాడిగి	10000	21500
దేవనూరు డీలక్స్	9000	19500
తెల్లకాయలు	5000	13000



పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

టీడీపీ కార్యకర్తలపై దాడి పిరికిపందచర్య

- మాజీ ఎమ్మెల్యే యరపతినేని

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 15 : మాచర్ల నియోజకవర్గంలోని దుర్గి మండలం జంగమహేశ్వరపురం గ్రామానికి చెందిన నలుగురు టీడీపీ కార్యకర్తలపై వైసీపీకి చెందిన కొందరు అమానుషంగా దాడికి పాల్పడి నరకడం పిరికిపంద చర్య అని మాజీ ఎమ్మెల్యే, టీడీపీ సీనియర్ నేత యరపతినేని శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో ఖండించారు. పిన్నెల్లి సోదరులు రాక్షసుల్లా తయారయ్యారని, రేపటి ఎన్నికలలో ఆ బ్రదర్స్‌ను మాచర్ల ప్రజలు ఇంటికి పంపేందుకు సంసిద్ధంగా ఉన్నారన్నారు. ఇప్పటికే నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీకి చెందిన ఏడుగురు బీసీలను పొట్టన పెట్టుకున్నారని, అదేవిధంగా జల్లా యాదవ్‌ను హత్య చేయడంతో పాటు మరో ఐదుగురు కాళ్లు, చేతులను విరగ్గొట్టి గృహాలను సైతం తగులబెట్టారన్నారు. పొలాలు సాగు చేయనీయకుండా ఊరు వదిలి వెళ్లినా పిన్నెల్లి బ్రదర్స్ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూనే ఉన్నారన్నారు. మరలా ఇప్పుడు కొంతమందిపై దాడిచేసి చావబాదటాన్ని ప్రజాస్వామ్యవాదులందరూ ఖండించాల్సిన అవసరం ఉందన్నారు. వచ్చే ఎన్నికలలో రాష్ట్రంలో వైసీపీకి, మాచర్లలో పిన్నెల్లి బ్రదర్స్‌కు ప్రజలు గట్టిగా బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా వున్నారని యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు.

వచ్చేది టీడీపీ, జనసేన ప్రభుత్వమే

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి

రెంటచింతల, ఫిబ్రవరి 15 : రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేది టీడీపీ, జనసేన ప్రభుత్వమేనని, ప్రతి కార్యకర్త కష్టించి పనిచేయాలని, చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్ర భవిష్యత్ బాగుంటుందని టీడీపీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. జెట్టిపాలెం గ్రామ మాజీ సర్పంచ్ నీలం చెన్నమ్మ చిత్రపటానికి గురువారం ఆయన పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించి కుటుంబీకులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓటరు జాబితాలను ఒకటికి రెండుసార్లు పరిశీలన చేయాలని, దొంగ ఓట్లను చేర్చితే అందుకు అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నీలం మల్లయ్య, పెద నర్సయ్య, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు గొట్టం శ్రీనివాసరెడ్డి, మాజీ ఉప ఎంపీపీ ఊదే నాయక్, మార్కెట్ యార్డు మాజీ డైరక్టర్ ప్రభురాజ్ యాదవ్, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి కుర్రి శివారెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు అబ్బిరెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు గొంటు సుమంత్‌రెడ్డి, మాజీ డీసీ చైర్మన్ నరసింహారావు, నాగయ్య చౌదరి, టౌన్ అధ్యక్షులు రాజారెడ్డి, బోడపాటి రామకృష్ణ, మల్లయ్య యాదవ్, రాయపరెడ్డి, శౌర్రెడ్డి, చేర్రెడ్డి కృష్ణారెడ్డి, త్రిపుర గోవర్ధన్, మేకల బాలయ్య, పేరం సర్వారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ నేతల కార్యాచరణ


సమావేశమైన ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సంఘ నేతలు

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 15 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల, కార్మిక సంఘ నేతలు గురువారం పిడుగురాళ్ల ఎన్‌జీఓ కార్యాలయంలో సమావేశమయ్యారు. శనివారం పిడుగురాళ్లలో జరుగబోవు ర్యాలీ, ధర్నా కార్యక్రమ ప్రణాళికకై సంఘ నేతలు సమావేశం నిర్వహించారు. ఉద్యోగ సంఘాలు ఎక్కువ సంఖ్యలో హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని జేఏసీ చైర్మన్ డి.పట్టాభి తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్త వెంకటచలపతిరావు, రామలింగయ్య, ఇవి అప్పారావు, సాగర్‌బాబు, వెంకటరెడ్డి, సత్యానారాయణరాజు, కుంభా శ్రీను, స్వామి, సాంబశివరావు, నరసింహారావు, విజయబాబు, శ్రీనివాసరావు, చంద్రశేఖర్, వెంకటేశ్వరరావు, ప్రభాకర్ తదితరులు పాల్గొని పీఆర్సీ, 30 శాతం ఐఆర్ సాధించుకోవడం తో పాటు సమస్యలను పరిష్కరించే దిశగా తమ పోరాటం కొనసాగుతుందన్నారు.

- దాచేపల్లి, ఫిబ్రవరి 15 : పెండింగ్‌లో ఉన్న డీఏ, పీఆర్సీ బకాయిలను వెంటనే విడుదల చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ కమిటీ ఉద్యోగులు అన్నారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరారు. దాచేపల్లి మండల వైద్య, మండల పరిషత్ సిబ్బంది, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు మధ్యాహ్నం భోజన సమయంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పిడుగురాళ్ల ఏపీఎన్జీవో సంఘం అధ్యక్షుడు డి.పట్టాభి, సూపర్‌వైజర్లు కృష్ణకుమారి, గోవిందమ్మ, సరస్వతి, లక్ష్మయ్య, శివబాబు, కొప్పుల రవి, రామకోటేశ్వరరావు, ఇతర ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.
- సత్తెనపల్లి, ఫిబ్రవరి 15 : ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ గురువారం భోజన విరామ సమయంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల జేఏసీ నాయకులు పట్టణంలో ప్రదర్శన చేశారు. మునిసిపల్ కార్యాలయం వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ పెండెం మణిరావు మాట్లాడుతూ 30 శాతం ఐఆర్‌ని ప్రకటించాలని, జీపీఎఫ్‌ను వెంటనే ఖాతాల్లో క్రెడిట్ చేయాలన్నారు. పాత పెన్షన్ విధానాన్ని తీసుకురావాలన్నారు. గురుకుల పాఠశాలలో పని చేస్తున్న ఉద్యోగులకు 62 సంవత్సరాల వయో పరిమితిని పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సందెపోగు అంబేద్కర్, వెస్లి, ఇబ్రహీం, సందెపోగు శ్రీనివాసరావు, మునిసిపల్ మేనేజర్ నెట్టం సాంబశివరావు, మునిసిపల్ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.
- అమరావతి, ఫిబ్రవరి 15: ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఏపీఎన్జీవో అమరావతి యూనిట్ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఎన్జీవో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు సూరేపల్లి రాజశేఖర్, ఉద్యోగులు పి.సునీత, మురళీ, వెంకట్రావు, వెంకటకృష్ణ, పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల ఎదుగుదలను అడ్డుకున్న జగన్‌రెడ్డి : గుంటుపల్లి

దాచేపల్లి, ఫిబ్రవరి 15 : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక సంస్థల్లో బీసీల రిజర్వేషన్‌ను 34 నుంచి 24 శాతానికి తగ్గించాడని, ఇది బీసీల రాజకీయ ఎదుగుదలను దెబ్బతీసిందని టీడీపీ జాతీయ క్రమశిక్షణా కమిటీ సభ్యులు గుంటుపల్లి నాగేశ్వరరావు ఆరోపించారు. ఆయన గురువారం మాట్లాడుతూ టీడీపీ ప్రధాన కార్యదర్శి లోకేశ్ టీడీపీ అధికారంలోకి రాగానే 24 శాతం నుండి 34 శాతానికి పెంచుతామని ప్రకటించి బీసీలపై టీడీపీకి వున్న అభిమానాన్ని చాటుకున్నారన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ ప్రజానీకం తరుపున ఆయనకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. జగన్మోహన్‌రెడ్డి పరిపాలనలో నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ నిధులు ఇవ్వలేదన్నారు. రానున్న ఎన్నికలలో బీసీలు వైసీపీకి గుణపాఠం చెబుతారని తెలిపారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన తహసీల్దార్

మాచవరం, ఫిబ్రవరి 15: మండలంలోని పలు గ్రామాలలో గురువారం తహసీల్దార్ రామకృష్ణ పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. రేగులగడ్డ, చెన్నాయపాలెం, వేమవరం, తురకపాలెం, తదితర గ్రామాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను ఆయా గ్రామాల బీఎల్‌వోలతో కలిసి పరిశీలించారు. పోలింగ్ నిర్వహణకు కావలసిన విద్యుత్, రోడ్డు మార్గం, పాఠశాలకు ప్రహరీలు, మంచినీటి వసతి, మరుగుదొడ్ల వసతు లు ఉన్నాయా లేదా అనే విషయాలను పరిశీలించారు. అదేవిధంగా ఎస్ఐ కూడా పలు గ్రామాలలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. వారి వెంట ఆయా గ్రామాల బీఎల్‌వోలు, సీనియర్ అసిస్టెంట్ భూషణం, పంచాయతీ కార్యదర్శులు తదితరులున్నారు.

భావనారుషి కల్యాణానికి మహిళల కోలాటం

మాచవరం, ఫిబ్రవరి 15 : మాచవరంలోని భద్రావతి సమేత భావనారుషి స్వామి కల్యాణ మహోత్సవాన్ని పురస్కరించుకొని భద్రావతి మహిళా మండలి ఆధ్వర్యంలో గురువారం కోలాట ప్రదర్శన నిర్వహించారు. అంతకుముందు మహిళలు అధిక సంఖ్యలో తరలివచ్చి దేవాలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో మహానైవేద్యాన్ని ఇంటింటికి పంపిణీ చేశారు. 16వ తేదీన భావనారుషి కల్యాణ మహోత్సవం మిషన్‌బావి సెంటర్‌లో నిర్వహించనున్నట్లు దేవస్థాన కమిటీ తెలిపింది.

జనాలను చంపిస్తూ పుట్టిన రోజు వేడుకలా?

- అనిల్‌కుమార్ యాదవులకిచ్చిన గిఫ్ట్ ఇది
- పోలీసుల సహకారంతోనే దాడులు
- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి


చికిత్స పొందుతున్న అంజయ్యను పరామర్శిస్తున్న బ్రహ్మారెడ్డి

మాచర్ల, ఫిబ్రవరి 15 : ఓ పక్క జనాలను చంపిస్తూ మరో పక్క వార్డు వార్డునా పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంటున్నావా పిన్నెల్లి.. నీకసలు సిగ్గుందా అంటూ టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని వందలాది మంది బీసీ నేతలతో 50 వాహనాల్లో మద్దిమడుగు వెళ్తున్న బ్రహ్మారెడ్డి దుర్గి శివారులో టీడీపీ నేతలపై జరిగిన దాడి విషయం తెలుసుకొని మార్గ మధ్య నుంచి వెనక్కు వచ్చారు. మాచర్లలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న టీడీపీ నేతలు గాజుల అంజయ్య, రాజులను పరామర్శించి విలేకరులతో మాట్లాడారు. అనిల్‌కుమార్ యాదవ్ నియోజకవర్గంలోకి అడుగు పెట్టగానే ఆయన సామాజికవర్గానికే చెందిన వారిపై దాడులు జరిగాయని, ఇది అనిల్ కుమార్ యాదవ్ తన సామాజికవర్గానికి ఇచ్చిన గిఫ్ట్ అంటూ మండిపడ్డారు. సొంత సామాజికవర్గంపై జరిగిన దాడికి అనిల్‌కుమార్‌యాదవ్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇతనా బీసీలను రక్షించేది అంటూ ప్రశ్నించారు. నెల్లూరులో పనైపోయి ఇక్కడకు వచ్చిన అరాచకశక్తి, ఇక్కడున్న మరో అరాచకశక్తికి తోడై బీసీలపై దాడులకు దిగుతున్నారన్నారు. అడుగు పెట్టాడో లేదో దాడి జరిగిందన్నారు. ఇటువంటి అరాచకశక్తులకు అవకాశమిస్తే భవిష్యత్తులో అన్ని వర్గాలపై దాడులు జరుగుతాయన్నారు. వైసీపీ దౌర్జన్యానికి పుట్టకొకరు.. చెట్టుకొకరుగా బతుకుతుంటే వారిని కూడా వదలకుండా దాడికి దిగుతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. హత్యలు చేసిన వారిపై కాకుండా ఊరొదిలి బతుకుతున్న వారిపై రౌడీషీటు తెరుస్తారా అంటూ ఆగ్రహించారు. ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి బర్త్‌డే వేడుకల్లో పోలీసులు బందోబస్తులో మునిగారని, ప్రజలను పట్టించుకోవడమే మరిచారన్నారు. ఏం చేసినా పోలీసు శాఖ సహకరిస్తుందని ఈ ప్రాంతంలో దాడులకు తెగబడుతున్నారన్నారు. ఎన్నికలు వస్తున్నాయని అధికార పార్టీకి ఏ విధంగా సహకరించాలని పోలీసు శాఖ ఆలోచిస్తోందన్నారు. ఎవరికీ బయపడే పని లేదని, ప్రాణాలు ఒక్కరోజే పోతాయి.. భయం భయంగా పల్నాడు ప్రజలు బతికే పరిస్థితి లేదు.. చావో రేవో తేల్చుకునే రోజులు ఆసన్నమయ్యాయన్నారు. అనంతరం పిన్నెల్లి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. కాగా దుర్గి పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న శ్రీనును మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తీసుకువచ్చారు. శ్రీనును బ్రహ్మారెడ్డి పరామర్శించారు. దోషులను రక్షించేందుకు శ్రీను నుంచి పోలీసులు వేలిముద్రలు తీసుకున్నారని చెబుతూ శ్రీను చేతికి ఉన్న వేలిముద్ర గుర్తును చూపారు. శ్రీనుకు సంతకం వచ్చినప్పటికీ వేలి ముద్రలు తీసుకోవడంలో మర్మమేంటని ప్రశ్నించారు. ఈ అరాచకశక్తులను ఇంటికి పంపాలంటూ ఆగ్రహించారు.

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ ప్రత్యేక సేవా శిబిరం

విజయపురిసౌత్, ఫిబ్రవరి 15 : మాచర్ల మండలం బ్రహ్మానందపురంలో విజయపురిసౌత్ ఏపీఆర్‌డీసీ విద్యార్థులు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరం గురువారంతో ముగిసింది. 44 మంది ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఏడు రోజులపాటు గ్రామంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ వైఎన్ఎస్ చౌదరి పాల్గొని విద్యార్థులను అభినందించారు. అనంతరం పలు పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులతోపాటు సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ స్కూల్ హెచ్ఎం లక్ష్మీదేవి, ఎస్‌జీటీ శాంతారావు, సఫీనాబేగం, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్ఎం బాషా పాల్గొన్నారు.

ప్రతిభ గల విద్యార్థులకు బహుమతులు

విజయపురిసౌత్, ఫిబ్రవరి 15 : స్థానిక ప్రభుత్వోన్నత పాఠశాలలో గురువారం 1985-86 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు బత్తిన శ్రీనివాస బాబు, ఆయన సతీమణి హైమావతి తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం మేడికొండూరి రోశయ్య నాంచారమ్మ మెమోరియల్ అవార్డులను సమ్మెటివ్ 1 పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులతోపాటు దేశ నాయకుల పుస్తకాలను అందించారు. ఈ కార్యక్రమంలో ధర్మవరపు సుబ్రహ్మణ్యం, లక్ష్మీ, డాక్టర్ రమణ, పుల్లయ్య, పద్మావతి, రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

2 నుంచి సత్రశాలలో రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీలు

రెంటచింతల, ఫిబ్రవరి 15 : ప్రముఖ శైవక్షేత్రం కృష్ణానది ఒడ్డున గల సత్రశాలలో మార్చి 2 నుంచి 7వ తేదీ వరకు వరుసగా ఐదవ సారి రాష్ట్రస్థాయి ఎడ్ల పోటీలను నిర్వహించనున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు పులి ఓబులరెడ్డి చెప్పారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 6 విభాగాల్లో పోటీలుంటాయని రూ.11 లక్షలు విలువ చేసే బహుమతులిస్తామన్నారు. ఈ పోటీలు శ్రీ శివభక్త కుంటి మల్లారెడ్డి అన్నదాన సత్రంలో ఉంటాయన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులైన పత్తి కోటిరెడ్డి, బరువు శ్రీనివాసరెడ్డి, నెమలి సీతారామిరెడ్డి, సీఎల్పీ గోగుల వెంకటేశ్వరరెడ్డి, లింగిరెడ్డి కోటిరెడ్డి, ఎర్రెద్దు శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. పూర్తి వివరాలకు 9908775005, 8096533506 నెంబర్లను సంప్రదించాలన్నారు.


జన్మదిన వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే పీఆర్కే

ఘనంగా ఎమ్మెల్యే పీఆర్కే జన్మదిన వేడుకలు

మాచర్ల, ఫిబ్రవరి 15: పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో గురువారం ప్రభుత్వ విప్, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి జన్మదిన వేడుకలను కోలాహలంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 250 కేజీల భారీ కేక్‌ను కట్ చేశారు. పాతూరులోని శివాలయం, అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. నెల్లూరు సిటీ ఎమ్మెల్యే, నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ మాచర్లకు విచ్చేసి పుష్పగుచ్ఛం అందించి ఎమ్మెల్యే పీఆర్కేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి, యెనుముల మురళీధరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- రెంటచింతల, ఫిబ్రవరి 15 : ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి జన్మదిన వేడుకలు గురువారం రాత్రి రెంటచింతలలో ఘనంగా జరిపారు. భారీ కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ గొట్టం బ్రహ్మారెడ్డి, మాజీ కన్వీనర్ పూజల రామయ్య, ఎంపీపీ పి.సంపూర్ణమ్మ, ఉపాధ్యక్షులు శౌర్రెడ్డి, మాజీ ఎంపీపీ డి.చౌడేశ్వరీ, సర్పంచ్ పేర్ల చౌడమ్మ, జిల్లా జేసీఎస్ కన్వీనర్ మోర్తల ఉమ, మాజీ జడ్పీటీసీ భాస్కరరెడ్డి, మద్దిరాల కృష్ణారెడ్డి, పమ్మి సీతయ్య, యూత్ అధ్యక్షులు సతీష్‌రెడ్డి, ప్రతాపరెడ్డి, గొట్టం భాస్కరరెడ్డి, పేర్ల ముత్తయ్య యాదవ్, గుండా కిషోర్, లూర్దు మర్రెడ్డి ఉన్నారు.

ఛలో విజయవాడను జయప్రదం చేయాలి

గురజాలటౌన్, ఫిబ్రవరి 15 : ఈనెల 27వ తేదీన జరగనున్న ఛలో విజయవాడను జయప్రదం చేయాలని గురజాల జేఏసీ చైర్మన్ ఉన్నం హనుమంతురావు కోరారు. ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలన్నారు. మండల రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. జేఏసీ నాయకులు అప్పారావు, కందిమళ్ల నాగరాజు, అల్లం వాసు, లక్ష్మీనారాయణ, అంకమ్మరావు, వేముల శ్రీను పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్తులను కాజేస్తున్న అధికారులు : లెనిన్‌బాబు

మాచర్ల, ఫిబ్రవరి 15 : పట్టణంలోని పీడబ్ల్యూడీ కాలనీలో ప్రభుత్వ ఆస్తులను ఇరిగేషన్ అధికారులు కాజేస్తున్నారని మాజీ కౌన్సిలర్ లెనిన్‌బాబు ఆరోపించారు. ఏఈ కార్యాలయ భవనం తలుపులు, రేకులు, ఇనుము, టేకు కలపను అపహరించారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు రథసప్తమి వేడుకలు

అమరావతి, ఫిబ్రవరి 15 : రథసప్తమి పురస్కరించుకుని శుక్రవారం వైకుంఠపురంలోని వేంకటేశ్వరస్వామి ఆలయం, ఎండ్రాయి ఉగ్ర ఏకాంబరేశ్వరస్వామి ఆలయం, అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి.

బాల్య వివాహాలను అరికడదాం

పిడుగురాళ్ల, ఫిబ్రవరి 15 : బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా గురువారం ఐసీడీఎస్ అధికారులు బాల్యవివాహాలు, బాలల హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ టీజీవీ కృష్ణారెడ్డి, మండల అభివృద్ధి కమిటీ చైర్మన్ ముడేల వెంకటేశ్వరరెడ్డి, సీడీపీవో శ్రీవల్లి, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

పాత్రికేయునిపై దాడికి ఖండన

అమరావతి, ఫిబ్రవరి 15 : పెదకూరపాడు నియోజకవర్గ పరిధిలోని మల్లాది గ్రామంలో జరుగుతున్న ఇసుక అక్రమ క్వారియింగ్‌ను కవర్ చేసేందుకు వెళ్లిన పాత్రికేయుడు పరమేశ్వరరావుపై వైసీపీకి చెందిన ఇసుక అక్రమార్కులు దాడి చేయడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని బీజేపీ జిల్లా అధ్యక్షులు ఆలోకం సుధాకరబాబు అన్నారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

- గురజాలటౌన్, ఫిబ్రవరి 14: అమరావతిలో పాత్రికేయుడు పరమేశ్వరరావుపై జరిగిన దాడిని నిరసిస్తూ గురువారం గురజాల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యాన ఆందోళన నిర్వహించారు. గాంధీబొమ్మ సెంటర్ నుంచి అంబేద్కర్ కూడలి వరకు శాంతియుత ర్యాలీ జరిపారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ఆందోళన నిర్వహించారు. రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో డీటీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ అశోక్‌కుమార్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు షేక్ సైదా, అలరాజు, సుబ్రహ్మణ్యం, నాగులమీరా, జంపుల శ్రీనివాసరావు, కొత్తపల్లి శ్రీనివాసరావు, కడియం వేదమణి, యేచూరి మణిదీప్, పోటు ఏసుబాబు, రెంటాల నాగేశ్వరరావు, తన్నీటి బుచ్చిబాబు, కేతిరెడ్డి బాలకృష్ణారెడ్డి, దూదేకుల శ్రీనివాసరావు పాల్గొన్నారు.
- పెదకూరపాడు, ఫిబ్రవరి 15 : విలేకరిపై దాడి చేసిన వారిని శిక్షించాలని తహసీల్దార్ జీవీగుంట ప్రభాకరరావుకు వర్కింగ్ జర్నలిస్టుల యూనియన్ పెదకూరపాడు శాఖ ప్రతినిధులు వినతి పత్రం అందించారు. అమరావతి మండలంలో విలేకరిగా పని చేస్తున్న పరమేశ్వరరావుపై మండలంలోని మల్లాదిలో అధికార పార్టీకి చెందిన కొందరు దాడి చేశారు. వినతి పత్రం అందించిన వారిలో యూనియన్ ప్రతినిధులు మునగోటి శ్రీనివాసరావు, భూపతి హనుమయ్య, దాసరి విజయ్ బెన్నిబాబు, పరగటి రాజు, చెన్నంశెట్టి బాజీ ఉన్నారు.

డబుల్ ఎంట్రీ, డెత్‌లకు సంబంధించి 1045 ఓట్ల తొలగింపు

పెదకూరపాడు, ఫిబ్రవరి 15 : నియోజకవర్గంలో డబుల్ ఎంట్రీలు, మృతి చెందిన వారికి సంబంధించి ఓట్లను తొలగించేందుకు సీఈవోకు రిఫర్ చేసినట్లు నియోజకవర్గ ఓటర్ల నమోదు అధికారి దేసిరెడ్డి నాగజ్యోతి తెలిపారు. ఆమె గురువారం విలేకరులతో మాట్లాడుతూ ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ తరువాత కూడా ప్రతి ఓటును పరిశీలిస్తున్నామని, బీఎల్‌వోల నుంచి ఎప్పటికప్పుడు సమాచారాన్ని తీసుకుంటున్నామని వివరించారు. డబుల్ ఎంట్రీలు, మృతి చెందిన ఓటర్ల వివరాలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని, పార్టీలకు అతీతంగా ఓటర్ల నమోదు ప్రక్రియ ఉంటుందని వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రభాకరరావు ఉన్నారు.

పాటిబండ్లలో హెల్త్ సర్వే

పెదకూరపాడు, ఫిబ్రవరి 15 : మండలంలోని పాటిబండ్లలో గుంటూరు మెడికల్ కళాశాలకు చెందిన పీజీ వైద్యులు, హౌస్ సర్జన్‌లు, హెల్త్ ఆరోగ్య సర్వేను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు మెడికల్ కళాశాలకు చెందిన డాక్టర్ నాగేశ్వరరావు, 75 తాళ్ళూరు పీహెచ్‌సీకి చెందిన డాక్టర్ వెలుగొండారెడ్డి, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

పది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌ల పంపిణీ

ముప్పాళ్ళ ఫిబ్రవరి 15 : మండలంలో మాదల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో కాకతీయ జనసేవా సమితి ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లను సంస్థ అధ్యక్షుడు యెలినేడి రామస్వామి గురువారం అందజేశారు. సత్తెనపల్లిలో, ముప్పాళ్ళ మండలంలో 10వ తరగతి విద్యార్థులకు అందజేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో దరువూరి నాగేశ్వరరావు, గన్నమనేని శ్రీనివాసరావు, బొప్పూడి శీనయ్య, సింగమనేని శ్రీనివాసరావు తదితరులున్నారు.

బాపులమ్మ కుటుంబ సభ్యులకు డాక్టర్ సాయి కృష్ణ పరామర్శ

నకరికల్లు, ఫిబ్రవరి 15 : మండలంలోని కుంకలగుంటలో దమ్మవశం బాపులమ్మ కుటుంబ సభ్యులను టీడీపీ నేత డాక్టర్ సింగరాజు సాయికృష్ణ గురువారం పరామర్శించారు. బాపులమ్మ బుధవారం మృతి చెందటంతో గురువారం ఆమె భౌతికకాయంపై పుష్పగుచ్ఛం ఉంచి సాయికృష్ణ నివాళులర్పించారు. ఆమె కుమారులు దమ్మవశం కోటేశ్వరరావు, కొండలను సాయికృష్ణ పరామర్శించి తాము అండగా ఉంటామని తెలిపారు. స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

తాళాలు వేసిన ఇంట్లో బంగారం చోరీ

దాచేపల్లి, ఫిబ్రవరి 15 : తాళాలు వేసిన ఇంటినే లక్ష్యంగా చేసుకొని బీరువాలో దాచిన 100 గ్రాముల బంగారాన్ని దోచుకున్నట్లు దాచేపల్లి ఎస్ఐ సంధ్యారాణి గురువారం తెలిపారు. దాచేపల్లి మండలం శ్రీనగర్ గ్రామానికి చెందిన భూక్యా బాలాజీనాయక్ సాగర్ సిమెంట్స్‌లో ఎలక్ట్రికల్ కార్మికుడిగా పని చేస్తున్నారు. ఆయన భార్య వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లింది. ఇంటికి తాళాలు వేసి ఎవరి విధులకు వారు వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు బీరువాలో దాచిన నానుతాడు, నల్లపూసల గొలుసు, చెవి దిద్దులు, సుమారు 100 గ్రాముల విలువ కలిగిన బంగారాన్ని తస్కరించారు. సాయంత్రం పొలం నుంచి ఇంటికి వచ్చిన బాలాజీనాయక్ భార్య ఇంటి తాళాలు తీసివుండటం, బీరువా తెరిచి ఉండటాన్ని గమనించి పరిశీలించగా దొంగతనం జరిగినట్లు గుర్తించారు. స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయగా దర్యాప్తు చేస్తున్నారు. వేలిముద్రల నిపుణులు, డాగ్ స్క్వాడ్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

బస్సులో మద్యం స్వాధీనం

దాచేపల్లి, ఫిబ్రవరి 15 : హైదరాబాద్ నుంచి ఒంగోలుకు వెళ్తున్న బస్సులో అనుమతిలేని 45 మద్యం ఫుల్ బాటిల్స్‌ను గురువారం స్వాధీనం చేసుకున్నారు. దాచేపల్లి ఎస్ఐ సంధ్యారాణి వాహనాలను తనిఖీ చేస్తుండగా తనిఖీలో బస్సులో ఓ బ్యాగ్‌లో దాచిన మద్యం సీసాలు పట్టుబడ్డాయి. దీనిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. పట్టుబడిన మద్యం విలువ రూ.30 వేలు ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

వైసీపీ రాష్ట్ర లీగల్ సెల్ సహాయ కార్యదర్శిగా మణిబాబు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 15 : సత్తెనపల్లికి చెందిన న్యాయవాది చిన్నం మణిబాబును వైసీపీ రాష్ట్ర లీగల్ సెల్ సహాయ కార్యదర్శిగా నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉత్తర్వుల కాపీని మణిబాబు విలేకరులకు అందించారు.

విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలి : డీఈవో


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో వెంకటేశ్వరుడు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 15 : జిల్లాలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 10వ తరగతి చదివే విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలని డీఈవో ఎం.వెంకటేశ్వరుడు అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, సుగాలీ కాలనీ ఉన్నత పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులకు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ముందుగా బాలికల ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లను, నాడు-నేడు కింద జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని కూడా ఆయన పరిశీలించారు. అనంతరం సుగాలీ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. అనంతరం ఎస్ఆర్‌బీఎన్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడు కింద నిలిచి పోయిన పనులను ఆయన పరిశీలించారు. నిధులు విడుదలకాక పనులు ఆగిపోయాయని ఉపాధ్యాయులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్ళి నిధులు త్వరగా విడుదలయ్యే విధంగా చూస్తామని ఆయన తెలిపారు. ఆయనతో పాటు ఎంఈవోలు ఎస్.శ్రీనివాసరావు, కే.రాఘవేంద్రరావు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు జే.మాధవిలత, లత ప్రియదర్శిని, ఖాదర్ మస్తాన్ ఉన్నారు. జిల్లాలో 30,169 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకానున్నారని ఆయన ఆంధ్రజ్యోతికి తెలిపారు. 127 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు.

చర్చిలో కన్నా లక్ష్మీనారాయణ ప్రార్థనలు


ప్రార్థనలలో పాల్గొన్న కన్నా లక్ష్మీనారాయణ తదితరులు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 15 : పట్టణంలోని బాక్స్ మెమోరియల్ సెంటినరీ బాప్టిస్ట్ చర్చి నూతన మందిర తృతీయ వార్షిక వేడుకలు ఘనంగా జరిగాయి. వేడుకల్లో పాల్గొన్న టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం చర్చి పెద్దలు కన్నాను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో గుజ్జర్లపూడి సుందరరావు స్కైలాబ్, రాజేష్ కన్నా, చంద్రకాంత్, ఇజ్రాయేలు, జాషువా, బలిజేపల్లి సురేష్, చిలాకా శ్యామ్‌లతో పాటు పలువురు టీడీపీ నాయకులు, సంఘస్థులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు పెళ్ళి కానుక అందజేత

సత్తెనపల్లి, ఫిబ్రవరి 15 : పట్టణంలోని కాకతీయ కల్యాణ మండపంలో జరిగిన నన్నపనేని వారి వివాహ వేడుకల్లో నూతన వధూవరులకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ పంపించిన పెళ్ళి కానుకను టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అందించారు. నూతన వధూవరులు నాగ తేజశ్విని, వెంకట గణేష్ అఖిల్‌కు కన్నా దీవెనలు అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు చౌట శ్రీనివాసరావు, నూర్ బాషా జానీ బాబు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

16వ వార్డులో కన్నా నాగరాజు ప్రచారం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 15 : టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ విజయాన్ని కాంక్షిస్తూ ఆయన తనయుడు గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు గురువారం రాత్రి పార్టీ నాయకులతో కలిసి పట్టణంలోని 16వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. టీడీపీ ఎన్నికల మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కటకం రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి నూర్‌బాషా జానీ బాబు, తెలుగు మహిళ పట్టణ అధ్యక్షురాలు ఎలినేడి లక్ష్మీతులసీ, నాయకులు నోముల ప్రకాష్, కంభంపాటి అబ్రహం, బండారు నాగరాజు, ఎస్ కిరణ్, తోట అంబిక, జనసేన, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇసుక తవ్వకాలపై మొక్కుబడి తనిఖీలు

- టీడీపీ సీనియర్ నాయకులు కంచేటి సాయి విమర్శ

క్రోసూరు, ఫిబ్రవరి 15 : పెదకూరపాడు నియోజకవర్గంలో ఇసుక అక్రమ తవ్వకాలపై సాక్ష్యాధారాలతో సహా ఫిర్యాదు చేస్తే మొక్కుబడి తనిఖీలతో మమ అనిపించారని టీడీపీ సీనియర్ నాయకులు కంచేటి సాయి బాబు గురువారం విమర్శించారు. కోర్టు ఆదేశాల మేరకు అధికారులను పంపించి ఇసుక తవ్వకాలు జరగనట్టుగా రికార్డులు సృష్టించటం శోచనీయం అన్నారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వానికి గాని, అధికారులకు గాని చీమకుటినట్టుగా కూడా లేదని ఆయన అన్నారు. అక్రమ ఇసుక తవ్వకాలను వెలుగులోకి తీసుకురావటానికి వెళ్ళిన అమరావతి విలేకరి పరమేశ్వరరావుపై దాడులు చేయటం శోచనీయం అన్నారు. విలేకరిపై దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయకపోతే ఉద్యమానికైనా సిద్ధమని ఆయన హెచ్చరించారు. ఇకనైనా అక్రమ ఇసుక తవ్వకాలను నిలిపి వేయాలని ఆయన డిమాండ్ చేశారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

సత్తెనపల్లి, ఫిబ్రవరి 15 : రక్తదానం ప్రాణదానంతో సమానమని డీఆర్‌డీఏ పీడీ బాలూ నాయక్ అన్నారు. పట్టణంలోని 3వ వార్డు కొత్త సుగాలీ కాలనీలో గురువారం సద్గురు సంపత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని నిర్వహించారు. సత్తెనపల్లి ఏరియా వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 40 మంది యువకులు రక్తదానం చేశారు. ముందుగా సేవాలాల్ మహారాజ్‌కి పూజలు చేసి ఆయన చిత్రపటాన్ని ఊరేగించారు. అనంతరం సుగాలీ కాలనీ యూత్ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ రమావత్ కోటేశ్వరరావు నాయక్, కాలనీ పెద్ద కే.శంకర్ నాయక్, కే.పురుషోత్తం నాయక్, ఆర్.బాలకృష్ణ నాయక్, కే.పెద లాలియా నాయక్, డీ.వెంకట్ నాయక్, రాజీవ్ కృష్ణా నాయక్, సాయి అఖిల్ నాయక్ పాల్గొన్నారు.

రాజధానిపై అవగాహన లేని మంత్రులు

సత్తెనపల్లి, ఫిబ్రవరి 15 : రాష్ట్ర రాజధానిపై మంత్రులకు, వైసీపీ నాయకులకు అవగాహన లేదని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి కంభాల వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు జగన్ శాసనసభలో అమరావతి రాజధానిగా ఒప్పుకున్నారని, అధికారంలోకి వచ్చాక మాట తప్పారన్నారు. ఎన్నికల ముందు వైసీపీ మంత్రులు, నాయకులు ఒక్కొక్క రకంగా మాట్లాడుతున్నారన్నారు. ఎన్ని కుట్రలు చేసినా బటన్ నొక్కుడు ముఖ్యమంత్రిని ప్రజలు అదే బటన్ నొక్కి ఇంటికి పంపించే రోజులు దగ్గరలో ఉన్నాయన్నారు.

టీడీపీ కార్యకర్తను పరామర్శించిన నాయకులు

అచ్చంపేట, ఫిబ్రవరి 15 : అచ్చంపేటలోని 53వ బూత్ కన్వీనర్ ఎస్కే మాబూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. తెలుగుదేశం పార్టీ నాయకులు గురువారం మాబూను పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. అచ్చంపేటలో అనారోగ్యంతో ఉన్న జహీరాను నాయకులు పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ఉపాధ్యక్షుడు నల్లమేకల వెంకటేశ్వర్లు, మొక్కపాటి గిరిబాబు, మాబూవలి, శివరాత్రి పెద్ద శ్రీను, పోట్ల శ్రీనివాసరావు, తాళ్ళూరి రాంబాబు, మలిశెట్టి నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం అందజేత

అచ్చంపేట, ఫిబ్రవరి 15 : అచ్చంపేటలోని ఎస్సీ కాలనీ కుల పెద్ద సందెపోగు నాగేశ్వరరావు(70) అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులకు వైసీపీ మండల నాయకుడు సందెపోగు పున్నారావు రూ.10 వేల ఆర్థిక సహాయం అందించారు. మట్టి ఖర్చుల నిమిత్తం వీటిని అందజేసినట్టు పున్నారావు తెలిపారు. పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు జరిగే బంద్‌ను జయప్రదం చేయాలని ప్రచారం

క్రోసూరు, ఫిబ్రవరి 15 : గ్రామీణ, పారిశ్రామిక బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ గురువారం క్రోసూరు మండలంలోని అన్ని గ్రామాల్లో సీఐటీయూ, సీపీఎం నాయకులు ప్రచారం నిర్వహించారు. క్రోసూరులో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శన నిర్వహించనున్నట్టు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు జీ.రవిబాబు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల, రైతుల హక్కులను కాలరాయటమేకాక నల్లచట్టాలను బలవంతంగా రుద్దటం శోచనీయం అన్నారు. ప్రచార కార్యక్రమంలో తిమ్మిశెట్టి హనుమంతరావు, ఏపూరి వెంకటేశ్వర్లు, షేక్ ముస్తఫా, జగన్నాధం తదితరులు పాల్గొన్నారు.



యక్కలవారిపాలెంలో ఇంటింటికి తిరిగి అవగాహన కలిగిస్తున్న డాక్టర్ చదలవాడ అరవిందబాబు

రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోంది

● డాక్టర్ చదలవాడ అరవిందబాబు

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 15: రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతోందని ప్రశ్నించిన ప్రజలందరిపై అక్రమ కేసులు పెడుతున్నారని నరసరావుపేట నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆరోపించారు. నరసరావుపేట మండలం యక్కలవారిపాలెంలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో డాక్టర్ చదలవాడ అరవిందబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, భావితరాల ఉజ్వల భవిష్యత్తు బంగారుమయం కావాలన్నా నారా చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు ఇంటింటికీ తిరిగి వివరించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలన్నా, మన బిడ్డల భవిష్యత్తు బాగుండాలన్నా అందరూ నారా చంద్రబాబు నాయుడుకు అండగా ఉండాలన్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చాక మహిళల అభివృద్ధికి చేపట్టనున్న మహాశక్తి సంక్షేమ పథకాలను ఇంటింటికీ తిరిగి ప్రజలకు వివరించారు. గడిచిన నాలుగేళ్ళలో రాష్ట్రంలో నిలిచిపోయిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు, అధ్వానంగా మారిన రహదారులు, నిలిచిపోయిన సంక్రాంతి కానుక, రంజాన్ తోఫా, క్రిస్మస్ కానుకలను పునఃప్రారంభించడం జరుగుతుందన్నారు. రైతుల అభివృద్ధి కోసం అర్హులైన రైతులందరికీ రాయితీపై వ్యవసాయ యంత్రాలు, పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు బండారుపల్లి విశ్వేశ్వరరావు, కొల్లి బ్రహ్మయ్య, పులిమి వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ తదితరులు

క్షతగాత్రులకు ఎమ్మెల్యే గొట్టిపాటి పరామర్శ

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 15: అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ప్రభుత్వ ఏరియా అసుపత్రిలో గురువారం క్షతగ్రాతులను పరామర్శించారు. అద్దంకి-నార్కెట్‌పల్లి రహదారిపై బాపట్ల జిల్లా సంతమాగులూరు మండలం ఏల్చూరుకు చెందిన కూలీల ఆటోను తిరుపతి నుంచి పిడుగురాళ్ళ వెళుతున్న కారు ఢీకొట్టడంతో నలుగురు మృతిచెందారు. పలువురు కూలీలు గాయపడ్డారు. మృతదేహాలను నరసరావుపేట ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రులు ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారు. మృతుల కుటుంబాలను, అదేవిధంగా క్షతగాత్రులను అద్దంకి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పరామర్శించారు. మృతులకు కుటుంబాలకు ప్రభుత్వం ఒక్కొక్కరికి రూ.5లక్షలు ఎక్స్‌గ్రేషియో చెల్లించాలన్నారు. అందరివి పేద కుటుంబాలని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఆయనవెంట ఎ.చినవెంకటరెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

రొంపిచర్ల, ఫిబ్రవరి 15: మండలంలోని విప్పర్ల సమీపంలో అద్దంకి - నార్కెట్‌పల్లి హైవేపై గుర్తు తెలియని వాహనం ఢీకొనటంతో వ్యక్తి మృతిచెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. యాచక వృత్తిని నిర్వహించేలా ఉన్నాడని పోలీసులు తెలిపారు. వాహనం ఢీకొనటంతో అక్కడికక్కడే మృతి చెందినట్టు పేర్కొన్నారు. అతని వద్ద ఆధారాలు ఏమీ లభించలేదని తెలిపారు. మృతుని ఆచూకీ తెలిసిన వారు ఫోన్ నెంబరు 9440796247ను సంప్రదించాలన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

కొండ్రముట్ల (ఈపూరు) ఫిబ్రవరి 15: విద్యుదాఘాతంతో గేదె మృతిచెందిన సంఘటన మండలంలోని కొండ్రముట్ల గ్రామంలో గురువారం జరిగింది. గ్రామానికి చెందిన సన్నెబోయిన వెంకటసుబ్బయ్య పాడి గేదె మేతకోసం చెరువు వైపు పొలాలకు తోలుకు వెళ్ళారు. చెరువు కట్టపై ఏర్పాటుచేసిన విద్యుత్ మోటారు తీగలు తగిలి గేదె మృతి చెందినట్లు బాధితుడు తెలిపాడు.



నూతన కమిటీ సభ్యులతో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

నరసరావుపేట మార్కెట్ యార్డు చైర్మన్‌గా వాసుదేవరెడ్డి

నరసరావుపేట రూరల్, ఫిబ్రవరి 15: పట్టణంలోని నరసరావుపేట మార్కెట్ యార్డు చైర్మన్‌గా మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన శనివారపు వాసుదేవరెడ్డి నియమితులయ్యారు. పట్టణంలోని గుంటూరు రోడ్డులోని వైసీపీ కార్యాలయంలో నూతన కమిటీ సభ్యులను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. నూతన కమిటీ సభ్యులు చైర్మన్‌గా శనివారపు వాసుదేవరెడ్డి, ఉపాధ్యక్షుడిగా పులుసు అన్నపూర్ణమ్మ, డైరెక్టర్లుగా పి.రామయ్య, నక్క వెంకటకోటేశ్వరరావు, బత్తుల పద్మలత, రవివర్మ, షేక్ బీబీ ఆశ, కుంభ శ్రీనివాసరావు, పెనుగొండ ప్రభాకర్, తడికమళ్ళ చిన్న కోటేశ్వరరావు, బి రామనాగేశ్వరరావు తదితరులను ప్రకటించారు. త్వరలో నూతన కమిటీ ప్రమాణ స్వీకారం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు.

కో-ఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ ఏర్పాటుకు కృషి

● కాకతీయ సొసైటీ చైర్మన్ డీఎల్ కాంతారావు

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 15: ఏపీ కో-ఆపరేటివ్ సొసైటీ ఫెడరేషన్ ఏర్పాటుకు కృషి చేయాల్సిన అవసరం ఉందని కాకతీయ సొసైటీ చైర్మన్ డీఎల్ కాంతారావు చెప్పారు. గురువారం పలు క్రెడిట్ కో-ఆపరేటివ్ సొసైటీల పాలకవర్గాలతో సమావేశం నిర్వహించారు. అన్ని సొసైటీల పాలకవర్గాలు కలిసి ఏపీ కో-ఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్‌గా ఏర్పడి బైలాస్ రూపొందించుకుందామని చెప్పారు. పేద, మధ్య తరగతి ప్రజలు జాతీయ బ్యాంకుల్లో రుణ పరపతి లేక ఇబ్బందులు పడుతున్నారని, వారికి సొసైటీలు రుణాలు అందించే అవకాశం లభిస్తుందన్నారు. రుణాల పంపిణీలో చెల్లింపులు సక్రమంగా లేని పక్షంలో ట్రిబ్యునల్‌కు వెళ్లాల్సి వస్తుందని దీని కారణంగా సొసైటీలు ఆర్థికంగా నష్టపోతున్నాయని, ఫెడరేషన్ ఉంటే ఈ సమస్యను అధిగమించే అవకాశం ఉందన్నారు. సొసైటీలపై రాజకీయ ఒత్తిళ్లు లేకుండా చేయవచ్చన్నారు.

మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

నరసరావుపేట లీగల్, ఫిబ్రవరి 15: అక్రమంగా మద్యం అమ్ముతున్న నిందితుడైన నకరికల్లు మండలం చీమలమర్రి గ్రామానికి చెందినర వీ జగన్నాథంను గురువారం అరెస్టు చేసినట్టు నరసరావుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నయనతార తెలిపారు. నిందితుడిని మండలంలోని అల్లూరివారిపాలెం గ్రామం వద్ద అదుపులోకి తీసుకున్నామని, అతని వద్ద నుంచి ఆరు మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేత

రొంపిచర్ల, ఫిబ్రవరి 15: మండలంలోని రొంపిచర్ల గ్రామానికి చెందిన నాయుడు చంద్రశేఖర్ ఇటీవల మృతి చెందాడు. కాగా చంద్రశేఖర్ వైఎస్ఆర్ బీమా యోజన పథకం కింద నమోదు చేసుకొని ఉన్నాడు. దీంతో అతని కుటుంబ సభ్యులకు రూ.10వేలు నగదును గురువారం వైసీపీ నాయకులు పడాల చక్రారెడ్డి అందజేశారు. మృతుని కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నాగేశ్వరరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం ప్రభుత్వంలోనే పేదలకు పక్కా ఇళ్లు

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



దుర్భరంగా ఉన్న జంగం దేవర్ల నివాస ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 15: రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ హయాంలోనే పేదలందరికీ పక్కా ఇళ్లు కట్టించి ఇవ్వటం, పకడ్బందీగా అమలు జరిగిందని మాజీమంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. తమ హయాంలో పేదలకు అన్ని వసతులతో టిడ్కో ఇళ్ళు కట్టించి ఇస్తే వాటిని పంపిణీ చేయకపోగా జగనన్న కాలనీల పేరు చెప్పి గృహ నిర్మాణాన్ని జగన్ పూర్తిగా అటకెక్కించారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే మరలా తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తేనే తమ సొంతింటి కలలు నెరవేరుతాయని లక్షల మంది పేదలు ఎదురు చూస్తున్నారని ప్రత్తిపాటి అన్నారు. గురువారం పట్టణంలోని 29వ వార్డు వినాయకనగర్‌లో నివాసం ఉంటున్న జగందేవర్ల ప్రాంతంలో ప్రత్తిపాటి పర్యటించారు. వారి ఆహ్వానం మేరకు సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారంతా కొద్దిపాటి పాకలు నిర్మించుకొని 30 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నామని, ఇప్పటికీ కనీస వసతులు లేవని వాపోయారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరినప్పటికీ ఎవ్వరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలో పారిశుధ్యం అధ్వానంగా మారిందన్నారు. ఇళ్ళ మధ్యే మురుగు చేరి దుర్గంధం వ్యాపిస్తుందన్నారు. రోడ్లు, తాగునీటి సదుపాయం కూడా కనీసం కల్పించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అటు ప్రభుత్వం, ఇటు మునిసిపల్ అధికారులు తమను పట్టించుకోవటం లేదన్నారు. ఆ కాలనీ వాసుల సమస్యలన్నీ సావధానంగా విన్న ప్రత్తిపాటి టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి ప్రాధాన్యంగా ఇక్కడి సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. ప్రతి పేద కుటుంబానికి ఇల్లు అందజేయాలన్నదే చంద్రబాబు ఆశయం అని, తెలుగుదేశం, జనసేన ఉమ్మడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అందరికీ న్యాయం చేస్తామని ప్రత్తిపాటి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజా రమేష్, టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రత్తిపాటి ఫౌండేషన్ ఆర్థికసాయం

పట్టణంలోని 11వ వార్డుకు చెందిన షేక్ రెహ్మాన్ మరణించిన విషయం తెలుసుకున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపి వారికి ప్రత్తిపాటి ఫౌండేషన్ ద్వారా రూ 10వేలు ఆర్థిక సాయాన్ని పంపారు. పార్టీ నాయకులు కల్లి వీరారెడ్డి, బెజ్జం రవి, మిల్క్ రఫీ, ఎన్‌టీఆర్ రఫీ, సుభాషిణి, పరిశుద్ధరావు తదితరులు వారి కుటుంబానికి సానుభూతి తెలియజేసి ఆర్థికసాయాన్ని అందించారు.

షిర్డీ సాయికి ప్రత్యేక పూజలు

చిలకలూరిపేట అర్బన్, ఫిబ్రవరి 15: రాష్ట్రానికి పట్టిన పీడ పోవాలి, ప్రజలంతా సుభిక్షంగా ఉండాలన్నదే ఇప్పుడు అందరి అభిమతం అని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. గడిచిన ఐదు సంవత్సరాలుగా రాష్ట్రాన్ని వైసీపీ ఒక పీడలా పట్టి వేదిస్తుందన్నారు. అందుకే మరో రెండు నెలల్లో రానున్న ఎన్నికల్లో ఈ బాధ శాశ్వతంగా తొలగి ప్రజలంతా గతంలో లాగా స్వేచ్ఛా జీవితం గడపాలని, సుఖ శాంతులతో ఉండాలని ఆ భగవంతుడిని ప్రార్థించినట్టు ఆయన తెలిపారు. పట్టణంలోని ఫైర్ స్టేషన్ సమీపంలో శ్రీ షిరిడీ సాయి పర్తి సాయి ఆధ్యాత్మిక ధ్యాన మందిరం 15వ వార్షికోత్సవంలో ప్రత్తిపాటి పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపతి, మహారుద్ర, సుదర్శన హోమాల్లో పాల్గొన్నారు. అర్చకులు వేదాశీర్వచనం అందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బంజారాలను చైతన్యపరిచిన సేవాలాల్ మహరాజ్

● ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 15: సేవాలాల్ మహరాజ్ బంజారాలను చైతన్యపరిచి వారి బతుకులలో వెలుగులు నింపిన మహానుభావుడని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. గురువారం నరసరావుపేట పట్టణంలోని రెడ్డినగర్‌లో ఉన్న గిరిజన బాలుర గురుకుల పాఠశాలలో బంజారాల ఆరాధ్యదైవం సేవాలాల్ మహరాజ్ 285వ జయంతి వేడుకలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ 1739లో జన్మించిన సేవాలాల్ మహరాజ్ బాలబ్రహ్మచారి అని, ఆయన జీవితాంతం బంజారాల కోసమే పాటుపడ్డారన్నారు. గిరిజన విద్యార్థి సేన రాష్ట్ర అధ్యక్షుడు కేతావత్ పాండునాయక్ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మూడావత్ విష్ణునాయక్, గిరిజన విద్యార్థి సేన పల్నాడు జిల్లా అధ్యక్షుడు రామావత్ అంజినాయక్, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన క్రీడలలో విజేతకు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు బహుమతులు అందజేశారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తదితరులు



సేవాలాల్ మహరాజ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీడీపీ జిల్లా ఎస్టీ సెల్ నాయకులు

టీడీపీ జిల్లా కార్యాలయంలో...

నరసరావుపేట టౌన్, ఫిబ్రవరి 15: నరసరావుపేట పట్టణంలోని పల్నాడు జిల్లా టీడీపీ కార్యాలయంలో గురువారం సేవాలాల్ మహరాజ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు కోటా నాయక్, హంసావత్ కుబర్ నాయక్, భూక్యారవి నాయక్, భూక్యా శ్రీనివాస్ నాయక్, నరసింహానాయక్, తదితరులు పాల్గొన్నారు.

18న వేల్పూరులో ఇంటింటికీ కుళాయిలు ప్రారంభం

వేల్పూరు (శావల్యాపురం) ఫిబ్రవరి 15: జల్‌జీవన్ మిషన్ పథకం ద్వారా మండలంలోని వేల్పూరులో నూతనంగా ఏర్పాటుచేసిన ఇంటింటికీ కుళాయిలను ఈ నెల 18వ తేదీన ప్రారంభించనున్నట్లు ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని బుధవారం తెలిపారు. ఎంపీపీ మాట్లాడుతూ జల్‌జీవన్ మిషన్ నిధులతో తాగునీటి చెరువు నుంచి పైప్‌లైన్‌లు ఏర్పాటుచేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లోని 700కుటుంబాలకు ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాల్గొంటారని, అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య, ఇన్‌చార్జి సర్పంచ్ రత్నగిరి, గ్రామ నాయకులు పాల్గొన్నారు.



సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు తదితరులు

ఘనంగా సేవాలాల్ మహరాజ్ జయంతి

వినుకొండ, ఫిబ్రవరి 15: సుగాలీల ఆరాధ్య దైవం సంత్ శ్రీసేవాలాల్ మహరాజ్ 285వ జయంతి కార్యక్రమాన్ని మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజనుల, బంజారా, సుగాలీల ఆరాధ్యదైవమైన మహరాజ్ జయంతి ఉత్సవాలు జరుపుకోవడం ఆనందదాయకమన్నారు. ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. గిరిజనులకు హిందూ ధర్మం గురించి తెలియజేసిన మహనీయుడు సేవాలాల్ మహరాజ్ అని కొనియాడారు. కార్యక్రమంలో విష్ణు నాయక్, ఎం.రవినాయక్, వెంకటేశ్వర్లునాయక్, మస్తాన్‌నాయక్, కె.రవినాయక్, రెడ్డి వెంకటరత్నం, గాలి నాగేశ్వరరావు, తులం శ్రీను తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న గంగినేని చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గంగినేని రాఘవ, హెచ్‌ఎం వీ శ్రీనివాసరావు తదితరులు

విద్యార్థులు శక్తి సామర్థ్యాలను పెంపొందించుకోవాలి

● నూజెండ్ల జడ్పీ పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు

నూజెండ్ల, ఫిబ్రవరి 15: విద్యార్థులు, ఉపాధ్యాయులు చేసే సూచనలను, బోధనలను ఇష్టపడి అభ్యసించి శక్తి సామర్థ్యాలను పెంపొందించుకోవాలని నూజెండ్ల జడ్పీ పాఠశాల హెచ్‌ఎం యూ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక జడ్పీ పాఠశాల 10వ తరగతి విద్యార్థుల ఫేర్‌వెల్ డేను గురువారం ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గంగినేని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గంగినేని రాఘవ విద్యార్థులకు పరీక్షా మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో రెండో ఎంఈవో రవిచంద్ర, వైస్ హెచ్‌ఎం వీవీ శ్రీనివాసరావు, పూర్వ విద్యార్థులు ఖాజా, రమేష్‌బాబు, గోవిందయ్య, మాజీ ఎస్‌ఎంసీ చైర్మన్ వెంకట నరసయ్య తదితరులు పాల్గొన్నారు.



రైల్వేస్టేషన్‌లో కార్మికులకు కరపత్రాలను అందజేస్తున్న నాయకులు

నేటి సమ్మెను విజయవంతం చేయాలని ప్రచారం

వినుకొండటౌన్, ఫిబ్రవరి 15: ఈ నెల 16న జరిగే పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలంటూ సీపీఐ నాయకుడు బూదాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బీఎస్ఎన్ఎల్, ఎల్ఐసీ, పోస్టాఫీస్, రైల్వే స్టేషన్ వంటి కేంద్ర ప్రభుత్వ పరిధిలో పనిచేస్తున్న ప్రభుత్వ కార్యాలయాల్లో గురువారం కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బూదాల శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, దీంతో వ్యవసాయం, గనులు, విద్యుత్, అటవీ సంపద, రవాణా, బ్యాంకింగ్, ఎల్ఐసీ వంటి సంస్థలను అదానీ, అంబానీ వంటి కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పేందుకు చూస్తుందన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేపట్టే సమ్మె కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.



వలస కూలీలతో మాట్లాడుతున్న జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము

రైతులకు అండగా నిలవాలి: రాము

నూజెండ్ల, ఫిబ్రవరి 15: పంటల సాగులో అహర్నిశలు కష్టపడి పని చేస్తూ కష్టనష్టాలతో బాధపడుతున్న రైతులకు సమాజం అండగా ఉండాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉలవలపూడి రాము అన్నారు. ఈ నెల 16వ తేదీన గ్రామీణ రైతు బంధువు, పారిశ్రామిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ మండల కేంద్రం నూజెండ్ల, పరిసర గ్రామాల్లో గురువారం పర్యటించి సమ్మెలో పాల్గొనాలని కోరారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ రైతులకు ఇచ్చిన ఏ హామీని ప్రభుత్వాలు నెరవేర్చటం లేదన్నారు. పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే ప్రభుత్వం పట్టనట్టు వ్యవహరించటం మంచిది కాదన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలు చేస్తే, వ్యవసాయం లాభసాటిగా అయ్యే అవకాశం ఉందన్నారు.

అమ్మా సేవ నిలయానికి రూ.లక్ష విరాళం

పొన్నూరు టౌన్, ఫిబ్రవరి 15: మండల పరిధిలోని కసుకర్రు గ్రామంలో నిర్మితమవుతున్న అమ్మా సేవ నిలయానికి పట్టణంలోని శ్రీషిర్డీసాయి సత్సంగ సేవా సమితి నిర్వాహకులు గురువారం రూ.1లక్ష విరాళం అందచేశారు. అమ్మా సేవా నిలయం సంస్థ దశాబ్దాలుగా వృద్ధులకు, అనాథలకు నీడను అందిస్తోంది. ఈ సంస్థకు సొంత భవనాలను సమకూర్చుకునేందుకు దాతలు విరాళాలను అందిస్తున్నారు. సమితి సభ్యులు గాదె హనుమంతరావు, కోట వెంకటేశ్వర్లు తదితరులు విరాళాన్ని అందించారు.



చిలకలూరిపేట తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జేఏసీ నాయకులు

తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏపీ జేఏసీ నిరసన

చిలకలూరిపేట, ఫిబ్రవరి 15: ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో గురువారం చిలకలూరిపేట తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు నిరసన తెలిపారు. తమ డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని కోరుతూ వారు తహసీల్దార్ జే నరసింహంకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చిలకలూరిపేట జేఏసీ చైర్మన్ హనుమంత్‌నాయక్, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి పోటు శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీన జేఏసీ ఆధ్వర్యంలో తల పెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. 12వ పీఆర్‌సీని అమలు చేయాలని, 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలను తక్షణం చెల్లించాలని కోరారు. ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు పెన్షనర్లకు ఉన్న బకాయిలను తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దుచేసి పాత పింఛను విధానాన్ని అమలు చేయాలన్నారు. ప్రతినెల 1వ తేదీన జీతాలు, పించన్లు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆయా సంఘాలకు చెందిన పీ రాఘవేంద్రరావు, రాజాబాబు, కే తిరుపతయ్య, వెంకటేశ్వర్లు, సువర్ణలత, జ్యోతి, మానస తదితరులు పాల్గొన్నారు.

పదిలో నూరు శాతం ఫలితాలు సాధించాలి

● డీవై ఈవో వేణుగోపాలరావు



వంకాయలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రికార్డులను పరిశీలిస్తున్న నరసరావుపేట డీవైఈవో వేణుగోపాలరావు

వంకాయలపాడు (యడ్లపాడు), ఫిబ్రవరి 15: పదో తరగతి పరీక్షలలో నూరు శాతం ఫలితాల సాధనకు ఉపాధ్యాయులు కృషిచేయాలని నరసరావుపేట డీవై ఈవో వేణుగోపాలరావు ఆదేశించారు. వార్షిక తనిఖీలలో భాగంగా మండలంలోని వంకాయలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన గురువారం సందర్శించారు. ముందుగా పాఠశాలలో 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం పాఠశాల రికార్డులను పరిశీలించి ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో వార్షిక తనిఖీ ప్యానల్ సభ్యులు కేవీరామిరెడ్డి, ఏవీ నాయుడు, సుగంధరావు, విజయభారతి, శ్రీనివాసరావు, జి.శంకరరావు, ఎం.కిషోర్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి రూ.10వేల సాయం



ఆర్థికసాయం చేస్తున్న తేళ్ళ సుధీర్

చిలకలూరిపేట, ఫిబ్రవరి 15: పట్టణంలోని సుగాలీ కాలనీలో మృతిచెందిన బాణావత్ సురేష్‌నాయక్ కుటుంబానికి గురువారం జరిగిన కార్యక్రమంలో తేళ్ళ హరి ప్రసాదు చారిటబుల్ ట్రస్ట్ తరుపున ట్రస్ట్ చైర్మన్ తేళ్ళ సుధీర్ రూ.10వేలు ఆర్థికసాయం చేశారు. అతడి ఇద్దరి పిల్లలకు చదువులు చెప్పిస్తానని, గృహ నిర్మాణం చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ పేద కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కంకటి శివ, జంగా ఏడుకొండలు, తారా నాయక్, శ్రీకాంత్, నాగభూషణం, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి

చిలకలూరిపేట, ఫిబ్రవరి 15: పట్టణంలోని నరసరావుపేట సెంటర్‌లో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి కార్యక్రమాన్ని గురువారం ఏపీ గిరిజన సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం చేశారు. సేవాలాల్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు బీ శ్రీనునాయక్, మద్దుల వెంకటకోటయ్య, సింగ్ లెనిన్‌బాబు, కే నాగేశ్వరరావు, వెంకటనగేష్ తదితరులు మాట్లాడుతూ సుగాలీలకు అత్యంత ఆరాధ్య దైవమైన సేవాలాల్ జీవిత కాలంలో ఎంతో మంది గిరిజనులకు అనేక విధాలుగా సాయపడ్డారని పేర్కొన్నారు. పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారని పేర్కొన్నారు.

ఏపీ మోడల్ పాఠశాలలో వర్క్‌షాపు ప్రారంభం

నాదెండ్ల, ఫిబ్రవరి 15: మండలంలోని చిరుమామిళ్ళ గ్రామంలో ఏపీ మోడల్ పాఠశాలలో అటల్ ల్యాబ్‌లో విజ్ఞాన ప్రమ్ యూనిసెఫ్ వారి సంయుక్త ఆధ్వర్యంలో మేక్ ఏ టర్న్ మూడు రోజుల వర్క్ షాపును గురువారం జిల్లా సైన్స్ అధికారి ఏఏ మధుకుమార్ ప్రారంభించారు. రాష్ట్ర విద్యా శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు మూడు రోజుల పాటు ఈ వర్క్ షాపు నిర్వహించనున్నారు. ఈ వర్క్ షాపులో డిజైన్ థింకింగ్ ద్వారా విద్యార్థులు స్థానిక సమస్యలను గుర్తించి సమస్యలకు శాస్త్రీయ పరిష్కార మార్గాలను తెలుసుకోనున్నారు. అదేవిధంగా స్మార్ట్ సెలైన్ మానిటరింగ్ సిస్టమ్, రైన్ వాటర్ హార్వెస్టింగ్ తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీ మోడల్ పాఠశాల విద్యార్థులతో పాటు కస్తూర్బా గాంధీ, గణపవరం జడ్పీ ఉన్నత పాఠశాల తదితర పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ప్రిన్సిపాల్ ఝాన్సీరాణి, ఫ్యాకల్టీలు రోజారమణి, వీరాస్వామి, సైదాబీ, సాంబశివరావు, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ నూతన కార్యవర్గ నియామకం

శావల్యాపురం, ఫిబ్రవరి 15: ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం శావల్యాపురం మండల నూతన కార్యవర్గ నియామకాన్ని నర్సరావుపేటలోని ఎస్టీయూ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఎస్టీయూ శావల్యాపురం మండల అధ్యక్షుడిగా శావల్యాపురం జడ్పీ పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు కంప శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా తుమ్మలకుంట ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బిక్కా రాజారమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. గౌరవాధ్యక్షుడిగా గాజుల శ్రీనివాసరావు, ఆర్థిక కార్యదర్శిగా నూకల శ్రీనివాసరావు, మహిళా కన్వీనర్‌గా నిర్మలాకుమారి, సీపీఎస్ కన్వీనర్‌గా నెమలికంటి ప్రవీణ్, ఉపాధ్యక్షుడిగా మధుబాబు, రత్నకిషోర్, కార్యదర్శులు సుభాషిణి, మనోరమ నియమితులయ్యారు. మండలం నుంచి జిల్లా కౌన్సిలర్లుగా కొండ్రముట్ల వెంకటరత్నం, సురేష్, రత్నలత ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. నూతన కార్యవర్గసభ్యులను ఎస్టీయూ నాయకులు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విలేకరులు

వినుకొండ, ఫిబ్రవరి 15: అమరావతిలో ఓ పత్రికకు చెందిన విలేకరిపై వైసీపీ ఇసుక మాఫియా దుండగులు చేసిన దాడిని ఖండిస్తూ వినుకొండలో జర్నలిస్టుల ఆధ్వర్యంలో గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. దాడికి పాల్పడిన దుండగులను అరెస్టుచేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ బ్రహ్మయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పట్టణంలోని ఎలక్ట్రానిక్, ప్రింట్‌మీడియా సభ్యులు పాల్గొన్నారు.